ఈనాడు
అమరావతి
గుంటూరు
సోమవారం ఆగస్టు 31, 2026

అమ్మో.. ఎందరిని బలిగొంటుందో..!



గుంటూరు జీజీహెచ్ ఆవరణలో మాతా శిశు కేంద్రం పక్కనే తాగునీటి ట్యాంకు శిథిలావస్థకు చేరి.. ప్రమాదకరంగా మారింది. దీన్ని తొలగించాలని నిర్ణయించారు. అయితే.. ఆయా పనులు గత నాలుగు నెలలుగా నత్తనడకన సాగుతుండడంతో ప్రమాద తీవ్రత పెరుగుతోంది. ఇటుగానే రోగులు, వారి బంధువులు రాకపోకలు సాగిస్తుంటారు. ఎప్పుడు కూలి మీద పడుతుందో.. ఎవరి ప్రాణాలు బలిగొంటుందోనని భయపడుతున్నారు. ఓపీ విభాగం, వివిధ వార్డుల నుంచి ఎమర్జెన్సీ వార్డుకు వెళ్లే మార్గం ఇదే కావడంతో రద్దీ ఎక్కువగా ఉంటుంది. పెద్ద ఎత్తున రోగులు తిరుగుతూ ఉంటారు. అధికారులు స్పందించి.. ఎలాంటి ప్రమాదాలు జరగక ముందే దాన్ని తొలగించాల్సిన అవసరం ఉంది.

- ఈనాడు, అమరావతి

సజావుగా నీట్ పీజీ పరీక్ష

నగరపాలక సంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా నీట్ పీజీ - 2026 పరీక్ష ఆదివారం సజావుగా జరిగింది. కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించిన ఈ పరీక్షకు ఆరు కేంద్రాల్లో 796 మంది అభ్యర్థులు హాజరయ్యారని అధికారులు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఆర్వో ఖాజావలి పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. నిబంధనల ప్రకారం ఉదయం 8.30 గంటల వరకు అభ్యర్థులను అనుమతించారు.

ఆహ్లాదం అందదే.. ఆటవిడుపు అంతంతే..

గుంటూరు నగరంలోని పలు ఉద్యానవనాల్లో ఆహ్లాదం కంటే.. సమస్యలే స్వాగతం పలుకుతున్నాయి. పరికరాలు పాడైపోవడంతో పిల్లలు ఆడుకునే వీలు లేదు. ఓపెన్ జిమ్ నిర్వహణ లేక యంత్రాలు పని చేయడంలేదు. తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస వసతులు లేవు. వాకింగ్ ట్రాక్‌లు బాగోలేదు. కొన్ని పార్కులు మూసివేసి ఉండడంతో ప్రజలు వినియోగించుకోలేని దుస్థితి. ఆదివారం గుంటూరు, తెనాలిలో 'న్యూస్‌టుడే' పరిశీలనాంశాలు ఇలా ఉన్నాయి.

– న్యూస్‌టుడే, పట్టాభిపురం, పట్నంబజారు, నెహ్రూనగర్, తెనాలి (కొత్తపేట)

ఈనాడు సిటీ వాచ్

పార్కుల్లో దయనీయ పరిస్థితులు

చంద్ర రాజేశ్వరరావు ఉద్యాన వనం

కృష్ణనగర్ | సందర్శకులు 500



★ గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అస్తవ్యస్తంగా మారింది. అసాంఘిక కార్యకలాపాలకు నెలవైంది. కూటమి ప్రభుత్వం రూ.15 లక్షలతో ప్రహరీ ఎత్తు పెంచింది. ఓపెన్ జిమ్‌లో టైల్స్ పాడైపోయాయి. రంగులరాట్నం, జారుడు బల్లలను పక్కన పడేశారు. వాకింగ్ ట్రాక్‌లో నీళ్లు జల్లకపోవడంతో దుమ్ము లేచి వాకర్స్ ఇబ్బంది పడుతున్నారు.

పంచుమర్తి వీరయ్య చౌదరి ఉద్యానవనం

స్తంభాలగరువు | 300



★ సక్రమంగా తెరవడం లేదు. ఆదివారం మూడు గేట్లకు తాళాలు వేసి ఉన్నాయి. దీపాలు సరిగ్గా లేవు. చెట్లకు నీరు పెట్టేందుకు బోరు లేదు. ఆట వస్తువులు పాడైపోయాయి. రూ.10 లక్షలు మంజూరైనా పనులు చేయలేదు. తోటమాలికి వేరే విధులు అప్పగించడంతో ఇక్కడకు రావడం లేదు.

వంగవీటి మోహనరంగా మున్సిపల్ పార్కు

బాలాజీనగర్ | 400



★ నాలుగు నెలల క్రితం మహిళల వ్యాయామ పరికరాలు దెబ్బతిన్నాయి. నీటి పైపులు పాడయ్యాయి. పనిభారంతో సిబ్బంది అన్ని మొక్కలకు నీరు అందించడం లేదు.

శ్యామలనగర్ పార్క్

శ్యామలనగర్ | 700

★ మరుగుదొడ్లు లేవు. వాకింగ్ ట్రాక్ బాగా లేదు. రూ.5 లక్షలు మంజూరైనా అభివృద్ధి చేయలేదు. సిబ్బంది లేరు. పార్కు అభివృద్ధి కమిటీ నాయకులే సిబ్బందిని నియమించుకున్నారు. అభివృద్ధి పనులు చేస్తే నిధులు మంజూరు చేయిస్తానని అసోసియేషన్ నాయకులకు కమిషనర్ చెప్పినా.. ఇంజినీరింగ్ అధికారులు సహకరించడం లేదు.

మున్సిపల్ కార్పొరేషన్ పార్క్

100+ | ఆర్టీసీ కాలనీ 5వ వీధి



★ తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు లేవు. ఆట వస్తువులు పాడైపోయాయి. కొన్ని ప్రమాదకరంగా మారాయి. ఓపెన్ జిమ్ పరికరాల నిర్వహణ సరిగాలేదు.



వైఎస్సార్ మున్సిపల్ పార్కు

శ్రీకాంత్ నగర్ | 200

★ కొన్ని నెలలుగా మూతబడి ఉంది. వాచ్‌మెన్ లేరు. విద్యార్థులు, చంటి పిల్లలతో వచ్చిన వాళ్లు అసహనం వ్యక్తం చేశారు. ఆటవస్తువులు దెబ్బతిన్నాయి.

మున్సిపల్ కార్పొరేషన్ పార్కు

ఆర్టీసీ కాలనీ కన్నా స్కూల్ వెనుక | సగటున 300మంది

★ మరమ్మతు పనుల పేరుతో కొన్ని నెలలుగా పార్కు మూసేశారు. పరికరాలన్నీ పాడయ్యాయి. వాచ్‌మెన్ లేరు. భద్రతా చర్యలు లేవని స్థానికులు తెలిపారు.



కొడాలి వీరయ్య చౌదరి పార్కు

అమరావతి కాలనీ, తెనాలి | 200 మందికి పైగా..

★ భారీ వర్షాలు కురిసినప్పుడు నీట మునుగుతుంది. ఆట పరికరాలు పూర్తిగా పాడైపోయాయి.



గ్రామకంఠం... అర్హులకు పట్టా

- శతాబ్దాల నాటి సమస్యకు పరిష్కారం
- 812 మంది యజమానులకు ఉపశమనం

ఈనాడు – అమరావతి

ఇళ్లున్నాయ్... స్థలాలున్నాయ్.. అమ్మలేరు... కొనలేరు...

కుటుంబ సభ్యులకు బదిలీ చేయాలన్నా.. బహుమానంగా ఇవ్వాలన్నా.. అవసరాలకు అమ్ముకోవాలన్నా రిజిస్ట్రేషన్ కాని పరిస్థితి.

కారణం నిషేధిత జాబితా 22ఏ లో చేర్చడమే..

ఇక ఈ యాతనకు తెర పడింది. వట్టిచెరుకూరు, పుల్లడిగుంట, ఏటుకూరు గ్రామాల్లో అర్హులైన వారందరికీ హక్కు పత్రాలు దఖలు కాబోతున్నాయ్.. ఇందుకు ముహూర్తం సెప్టెంబరు 1.

వారికి పత్రాలు

- వట్టిచెరుకూరు, పుల్లడిగుంట, ఏటుకూరు గ్రామాల్లో గ్రామకంఠాన్ని నిషేధిత జాబితా నుంచి తొలగించడంతో 812 మందికి ఇళ్లపై హక్కులు లభించాయి.
- వట్టిచెరుకూరులో 515 మంది, పుల్లడిగుంటలో 206, ఏటుకూరులో 91 మందికి ధ్రువీకరణ పత్రాలిస్తారు.

వందేళ్లకుపైగా ఇళ్లల్లో నివాసం ఉంటున్నా భూమి వివరాలు ఆర్ఎస్ఆర్ (రీ సెటిల్‌మెంట్ రిజిస్టర్)లో పొరపాటున చెరువు పోరంబోకు, తోపు, దేవాదాయ అని నమోదు కావడంతో అధికారులు నిషేధిత జాబితాలోకి చేర్చారు. తొలగించాలంటూ ఏళ్ల తరబడి మూడు గ్రామాల ప్రజలు అనేక మంది అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా పరిష్కారం కాలేదు. రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ సాయికాంత్ వర్మ ఆదేశాలతో యంత్రాంగం అన్ని దస్త్రాలు సమకూర్చి ప్రభుత్వానికి నివేదించడంతో సమస్య పరిష్కారమైంది. సెప్టెంబరు 1న మంత్రి అనగాని సత్యప్రసాద్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఆధ్వర్యంలో వట్టిచెరుకూరులో లబ్ధిదారులకు ఇళ్లకు సంబంధించిన ధ్రువపత్రాలు అందజేయనున్నారు.

పరిష్కారమిలా...

★ వట్టిచెరుకూరు గ్రామం ఆర్ఎస్ఆర్‌లో చెరువు పోరంబోకు అని నమోదైంది. వాస్తవానికి చెరువు వేరు.. పక్కనే ఉన్న ఇళ్లు వేరు. పొరపాటున రెండూ కలిపి చెరువు పోరంబోకు 112 ఎకరాలుగా రాసేశారు. ఇదే ఆ గ్రామస్థులకు శాపంగా మారింది. నిషేధిత జాబితా 22(ఎ)లో పెట్టడంతో రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. అక్కడ చెరువు లేదని, ఆయకట్టూ లేదని, తమ పరిధిలోకి రాదని జలవనరులశాఖ నివేదించింది. 120 ఏళ్ల కిందట జరిగిన తప్పు సరిదిద్దాలని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు స్థానికులు విన్నవించారు. ఆయన ఆదేశాల మేరకు అధికారులు పూర్వ రికార్డులు, గ్రామ కైఫీయత్తులు, మహజర్లు సహా అన్నీ పరిశీలించి అక్కడ గ్రామం ఉందన్న విషయాన్నే వెల్లడిస్తున్నాయని తేల్చారు. ఇదే విషయాన్ని మండల, డివిజన్, కలెక్టరేట్ కార్యాలయాల నుంచి ప్రభుత్వానికి నివేదించడంతో నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది.

★ పుల్లడిగుంట గ్రామం తోపు కింద నమోదు కావడంతో 22ఏ నిషేధిత జాబితాలో నమోదు చేశారు. దస్త్రాలన్నీ పరిశీలించి గ్రామకంఠంగా గుర్తించి ఆ జాబితా నుంచి తొలగించారు.

★ ఏటుకూరులో కొంత స్థలం దేవాదాయ శాఖ పరిధిలో ఉందని నిషేధిత జాబితాలో చేర్చారు. దేవాదాయశాఖ అధికారులు సదరు భూమి తమ పరిధిలో లేదని నివేదిక ఇవ్వడంతో దస్త్రాలు పరిశీలించి నిర్ణయం తీసుకున్నారు. మూడు గ్రామాల్లో అర్హులకు ధ్రువీకరణ పత్రాలివ్వనున్నారు.

అటో.. ఇటో.. ఎటో..

కోచ్‌ల పొజిషన్ సరిగా చూపక.. ప్రయాణికుల పరుగులు

ఈనాడు, అమరావతి: రైల్వేశాఖలోని సాంకేతిక లోపాలు.. సిబ్బంది అలసత్వం ప్రయాణికులకు నరకం చూపిస్తున్నాయి. కాచిగూడ-రేపల్లె డెల్టా ఎక్స్‌ప్రెస్ రైలు (17625/17646) విషయంలో గందరగోళం మంచి ఉదాహరణ.

సమస్య ఏమిటంటే...

కాచిగూడ నుంచి రాత్రి సమయంలో రేపల్లెకు వచ్చే డెల్టా ఎక్స్‌ప్రెస్ (17625) తిరిగి పగటిపూట రేపల్లె నుంచి సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ (17646)గా బయల్దేరుతుంది. ఇది గమ్యస్థానానికి చేరాక లోకో/రేక్ రివర్సల్ జరుగుతుంది. ఫలితంగా రాత్రి వచ్చిన రైలు పగటు వెళ్లేటప్పుడు కోచ్‌ల వరుసక్రమం మారుతుంది. ఈ మార్పులకు తగిన విధంగా నేషనల్ ట్రైన్ ఎంక్వైరీ సిస్టమ్ (ఎన్‌టీఈఎస్) యాప్‌లోనూ, స్టేషన్‌లోని కోచ్ పొజిషన్ బోర్డులపై ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. కానీ.. రైల్వే సిబ్బంది సమాచారాన్ని సరిగ్గా అప్‌డేట్ చేయకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు.

వృద్ధులు, మహిళల అవస్థలెన్నో..

ఎన్‌టీఈఎస్ యాప్, ప్లాట్‌ఫారమ్ బోర్డుల్లో సమాచారాన్ని నమ్మి ప్రయాణికులు వారి కోచ్‌ల నంబర్లు బట్టి వేచి ఉంటున్నారు. తీరా రైలొచ్చాక చూస్తే అవి ఎక్కడో దూరంగా ఉంటున్నాయి. వారి బెర్తులు ఉన్న కోచ్‌ల వద్దకు పరుగెత్తలేక వృద్ధులు, మహిళలు, పిల్లలు అవస్థ పడుతున్నారు. ఈ లోపాలపై గుంటూరు డివిజనల్ రైల్ యూజర్స్ అసోసియేషన్ కూడా ఆందోళన వ్యక్తం చేసింది. ఎక్స్ వేదికగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లింది.

పడవల్లో విహారం.. పర్యాటక గమ్యస్థానం

కీలక ప్రాంతాల అభివృద్ధికి ప్రజాప్రతినిధుల ప్రతిపాదనలు

ఈనాడు – అమరావతి

పర్యాటకరంగాన్ని పూర్వవైభవం దిశగా తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. జిల్లాలోని చారిత్రక, ప్రకృతి, ఆధ్యాత్మిక ప్రాంతాలను ప్రముఖ పర్యాటక కేంద్రాలుగా మార్చేందుకు జిల్లా ప్రజాప్రతినిధులు కీలక ప్రతిపాదనలు చేశారు. జిల్లా యంత్రాంగం, రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ వీటి రూపురేఖలను సిద్ధం చేశాయి.

టూరిజం హబ్‌గా ఉప్పలపాడు పక్షుల సంరక్షణ కేంద్రం: దేశ విదేశాల నుంచి వచ్చే అరుదైన పక్షులకు నిలయమైన ఈ ప్రాంతాన్ని సమగ్ర పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేయాలని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ప్రతిపాదించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో వసతులు కల్పించి పర్యాటకులను ఆకర్షించనున్నారు.

శిల్పారామం చెరువులో బోటింగ్: సందర్శకులకు ఆహ్లాదం పంచేందుకు ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు బోటింగ్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని కోరారు.



తెనాలి బకింహామ్ కెనాల్ ట్రాక్ వద్ద బోటింగ్ సదుపాయం: కెనాల్ ట్రాక్ వద్ద పర్యాటకులను ఆకట్టుకునేలా బోటింగ్ సదుపాయాన్ని అందుబాటులోకి తేవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రతిపాదించారు. ఇది తెనాలి పట్టణానికి సరికొత్త పర్యాటక శోభ తెస్తుంది.

ఉండవల్లి గుహల వద్ద ప్రత్యేక పార్కింగ్ ఏరియా: అమరావతి రాజధాని ప్రాంతానికి సమీపంలో ఉన్న ప్రపంచ ప్రసిద్ధ చారిత్రక ఉండవల్లి గుహల వద్ద సందర్శకుల వాహనాల రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేకంగా విశాలమైన పార్కింగ్ ఏరియాను అభివృద్ధి చేయనున్నారు.



పర్యాటక ప్రాంతంగా ఫిరంగిపురం చర్చి: చారిత్రక.. ఆధ్యాత్మిక ప్రాముఖ్యత ఉన్న చర్చిని ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా అభివృద్ధి చేయాలని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ ప్రతిపాదన సమర్పించారు.

ఆర్థిక ప్రయోజనాలు : రాజధాని అమరావతి పరిధిలో ఇప్పటికే ఆమోదానికి నోచుకున్న పర్యాటక ప్రాజెక్టులకు అనుబంధంగా ఈ ప్రాంతాల అభివృద్ధి జరగనుంది. ప్రకృతి ప్రేమికులను, ఆధ్యాత్మికవేత్తలను, సాహస పర్యాటకులను ఆకట్టుకునేలా ఒక సమగ్ర పర్యాటక సర్క్యూట్ రూపుదిద్దుకునేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీని ద్వారా స్థానిక యువతకు ఉపాధి, రవాణా, ఆతిథ్య రంగాలలో అనేక నూతన అవకాశాలు లభిస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

అమరావతి అమ్మాయిలు.. క్రికెట్‌లో మెరుపులు



మంగళగిరిలోని ఏసీఏ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వేదికగా సెప్టెంబరు 15 నుంచి 26 వరకు మహిళల ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూఏపీఎల్) జరగనుంది. ఇందులో అమీతుమీ తేల్చుకునేందుకు నాలుగు జట్లు సిద్ధమయ్యాయి. ఈ జట్లలో ఒకటైన 'అమరావతి ఈ ఛాంపియన్స్'లో కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాలకు చెందిన నలుగురికి స్థానం లభించింది. భారత మహిళా క్రికెట్ జట్టులో స్థానం పొంది విజయాలను ఆస్వాదించడమే లక్ష్యమంటున్న వీరిపై ప్రత్యేక కథనం. – న్యూస్‌టుడే, విజయవాడ క్రీడలు

రమ్యారెడ్డి... ఆల్‌రౌండర్



పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన కందుల హేమసాయి రమ్యారెడ్డి ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. మేనమామ ప్రోత్సాహంతో 2022లో జీవీఆర్ అకాడమీలో కోచ్ పవన్‌సూర్య పర్యవేక్షణలో సాధన ప్రారంభించింది. అండర్-19 ఏసీఏ ఇంటర్ జోనల్ టోర్నీలో సెంట్రల్ జోన్‌కు ఆడి, సౌత్ జోన్ జట్టుపై 80 పరుగులు చేసింది. రైట్ హ్యాండ్ బ్యాటర్‌గా, రైట్ ఆర్మ్ ఆఫ్ స్పిన్ బౌలర్‌గా రాణిస్తోంది. ప్రస్తుతం ఎమ్మెస్కే క్రికెట్ అకాడమీలో సాధన చేస్తోంది.

రంగలక్ష్మి... బ్యాటింగ్‌లో రాటుదేలి...

ఇబ్రహీంపట్నం మండలం జూపూడికి చెందిన పరసా రంగలక్ష్మి డిగ్రీ చదువుతోంది. చిన్నతనంలోనే క్రికెట్‌పై ఆమె ఆసక్తిని గమనించిన తండ్రి శ్రీహరిగౌడ్ 2014లో ఐజీఎంసీ స్టేడియంలో కోచ్ చిరంజీవి వద్ద శిక్షణకు చేర్పించారు. బీసీసీఐ లెవల్-2 కోచ్ నిర్మల్‌కుమార్ పర్యవేక్షణలో మెరుగులు దిద్దుకుంది. అండర్-16, 19, 23, సీనియర్స్ కేటగిరీల్లో ఆంధ్రా జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. 2023లో కోల్‌కతాలో జరిగిన అండర్-23 వన్డే టోర్నీలో త్రిపుర జట్టుపై 172 పరుగులు చేసింది.

దీక్ష... బ్యాటింగ్‌లో దూకుడు



గుంటూరు ఎస్వీఎన్ కాలనీకి చెందిన కాట్రగడ్డ దీక్ష లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళా జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. క్రికెటరు అయిన తండ్రి శేషసాయి స్ఫూర్తితో ఏడేళ్ల వయసులో ఎమ్మెస్కే క్రికెట్ అకాడమీలో గోపి పర్యవేక్షణలో సాధన ప్రారంభించింది. 2024-25 సీజన్‌లో ఆంధ్రా అండర్-15 జట్టుకు సారథ్యం. సౌరాష్ట్ర జట్టుపై 53 బంతుల్లో 128 పరుగులతో రాణించింది. ఇండియా అండర్-19 జట్టులో స్థానం పొంది శ్రీలంకతో వన్డే, టీ20 సిరీస్‌లను కైవసం చేసుకోవడంలో కీలకంగా నిలిచింది. రైట్ హ్యాండ్ బ్యాటర్‌గా, వికెట్ కీపర్‌గా సత్తా చాటుతోంది.

సాయి దీప్తి.. కుడి ఎడమల సవ్యసాచి



గుంటూరుకు చెందిన బోగియ సాయి దీప్తి జేకేసీ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. తండ్రి రాజు పర్యవేక్షణలో 2014లో సాధన ప్రారంభం. జేకేసీ కళాశాల మైదానంలో పీడీ రాజేష్ శిక్షణలో రాటుదేలింది. 2022 నుంచి 2025 వరకు ఆంధ్రా అండర్-19 జట్టుకు ఆడింది. ముంబయి, పుణెలో జరిగిన ఆరు అంతర్రాష్ట్ర మ్యాచుల్లో 13 వికెట్లు, 2025లో ఔరంగాబాద్, కోల్‌కతాలో జరిగిన నాలుగు టీ 20 మ్యాచుల్లో 7 వికెట్లు తీసింది. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్ బౌలర్‌గా, రైట్ హ్యాండ్ బ్యాటర్‌గా రాణిస్తోంది.

పీజీఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

జిల్లా పరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే : ప్రతి సోమవారం జిల్లా, మండల స్థాయిలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సి.ఎం.సాయికాంత్ వర్మ ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు. టోల్ ఫ్రీ నంబర్ 1100కు ఫోన్ చేసి అర్జీల వివరాలు తెలుసుకోవచ్చన్నారు. మీకోసం వెబ్‌సైట్ Meekosam.ap.gov.in లోనూ అర్జీలు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయవచ్చన్నారు.

ప్రారంభం సరే.. పర్యవేక్షణ ఏదీ?

నత్త నడకన ఏఐ ఆధారిత ఐసీడీ స్క్రీనింగ్

ఈనాడు – అమరావతి

చిన్నారుల సర్వతోముఖాభివృద్ధికి.. వారి బంగారు భవిష్యత్తుకు ప్రభుత్వం బలమైన పునాదులు వేస్తోంది. ఈ క్రమంలోనే గుంటూరు జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ (ఐసీడీఎస్) కీలక ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఆరేళ్ల లోపు బాలల సంరక్షణ.. ఎదుగుదలపై ప్రత్యేకంగా దృష్టి సారించి.. అత్యాధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను జోడించి ఏఐ-ఎనేబుల్డ్ ఈసీడీ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది.

పురోగతి ఇలా..

జిల్లాలోని 1,480 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇప్పటివరకు 1,452 చోట్ల ఏఐ-ఎనేబుల్డ్ ఈసీడీ స్క్రీనింగ్ విజయవంతంగా పూర్తి చేసినట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అయితే చిన్నారులకు సంబంధించిన పరీక్షలను పూర్తి చేయడంలో వెనుకబాటు కనిపిస్తోంది. కారణం పర్యవేక్షణ లోపం. జిల్లావ్యాప్తంగా ఆరేళ్లలోపు వయసున్న పిల్లలు 83,208 మందికిగాను ఇప్పటివరకు 28,549 మందికి మాత్రమే స్క్రీనింగ్ పరీక్షలు చేసినట్టు ఐసీడీఎస్ వర్గాలు తెలిపాయి.

బాల్య వికాసంలో ఏఐ పాత్ర

శాస్త్రవేత్తల పరిశోధనల ప్రకారం.. మానవ జీవితంలో మూడేళ్లలోపు వయసులో పిల్లల మెదడు ఎదుగుదల 80 శాతానికిపైగా ఉంటుంది. ఈ కీలక దశలో ఎదురయ్యే లోపాలను ముందుగానే గుర్తించడం ద్వారా వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయొచ్చు. ఈ నేపథ్యంలో ఐసీడీఎస్ చేపట్టిన ఏఐ స్క్రీనింగ్ విధానంతో అనేక ప్రయోజనాలున్నాయి. చిన్నారుల్లో శారీరక, మానసిక, ప్రవర్తనాపరమైన ఎదుగుదల ఆలస్యాలను ప్రారంభ దశలోనే గుర్తించడానికి వీలవుతుంది. వీటిని సరిదిద్దేందుకు తక్షణమే డీఈఐసీ సెంటర్, ఇతర ఆరోగ్య కేంద్రాలకు సిఫార్సు చేసేందుకు తోడ్పడుతుంది. పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగవడానికి, ఆధునిక డిజిటల్ టెక్నాలజీ ద్వారా చిన్నారుల ఆరోగ్య ప్రగతిని నిరంతరం పర్యవేక్షించేందుకు వీలు కలుగుతుంది. నిర్దేశిత లక్ష్యం మేరకు పిల్లలకు త్వరితగతిన స్క్రీనింగ్ పూర్తి చేసేలా చొరవ చూపాల్సిన అవసరం ఉంది.


రాజధాని అభివృద్ధి రాష్ట్ర ప్రజల అదృష్టం

తాడికొండ, న్యూస్‌టుడే: అమరావతి అభివృద్ధి రాష్ట్రం చేసుకున్న అదృష్టం..రాజధానిగా తాడికొండ నియోజకవర్గ ప్రాంతాన్ని ఎంచుకోవడం చరిత్రాత్మక నిర్ణయమని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. తాడికొండలో రూ.5 కోట్ల సీఆర్డీఏ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన నిర్వహించారు. పెమ్మసానితో పాటు రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. పెమ్మసాని మాట్లాడుతూ పల్లెల అభివృద్ధికి భారీగా నిధులు తీసుకొచ్చాం.. రాష్ట్రంలో రోడ్లు, పాఠశాలల అభివృద్ధికి నిధుల కొరత ఉండదని చెప్పారు. భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో తరగతి గదులు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వాన్ని బలోపేతం చేసి..మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. తొలుత అతిథులకు తాడికొండ అడ్డరోడ్డు వద్ద ఘనస్వాగతం పలికి ర్యాలీగా గ్రామానికి తోడ్కొని వచ్చారు. మహిళలు హారతులిచ్చి సన్మానించారు. తెదేపా సీనియర్ నాయకులు యెడ్డూరి హనుమంతరావు ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పెమ్మసాని ఎస్సీ కాలనీ వాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దామరపల్లి గ్రామంలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించారు. బడేపురం గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాజ్యసభ సభ్యులు రామకృష్ణ, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

కొండల్ని పేల్చేసి.. గుండెల్ని పిండేసి..



ఈ చిత్రం చూస్తుంటే మీకే మనిపిస్తుంది. కొండల మధ్య మంచు దట్టంగా అలుముకున్నట్టుంది. కానీ అది కాదు. ప్రజారోగ్యానికి ముప్పు తెచ్చే దుమ్ము అది. గుంటూరు సమీపంలోని పేరేచర్ల, పెదపలకలూరు, చినపలకలూరు గ్రామాల్లో క్వారీలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ఇక్కడి కొండలను పేల్చే క్రమంలో తీవ్రమైన దుమ్ము వెలువడుతోంది. పరిసర ప్రాంతాల్లో కంకర తయారు చేసే యంత్రాల నుంచి కాలుష్యం ఏర్పడుతోంది. ఇవన్నీ కలిసిపోయి.. కొండలను కమ్మేస్తున్నాయి. దట్టమైన దుమ్ము పొరలతో నిండిపోయి.. దూరం నుంచి చూసేవారికి మంచు కురుస్తున్నట్లు భ్రమకలిగిస్తున్నాయి. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం వరకు ఇదే పరిస్థితి నెలకొంటోంది. - ఈనాడు అమరావతి, - న్యూస్‌టుడే, మేడికొండూరు

చెత్త తరలిపోయె.. సమస్య తీరిపోయె..

గుంటూరు- విజయవాడ జాతీయ రహదారిలో ప్రయాణం చేసేటప్పుడు ముక్కుపుటాలదిరేలా.. భరించలేని దుర్వాసన వచ్చిందంటే.. ఎయిమ్స్ ఆస్పత్రి వచ్చినట్లుగా గుర్తించేవారు. నాడు వైకాపా పాలనలో జాతీయ రహదారి నుంచి ఎయిమ్స్ ఆస్పత్రికి వెళ్లే దారి పక్కనే డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ చెత్తంతా ఇక్కడే వేసేవారు. సరైన ప్రాసెసింగ్ లేక లక్షలాది టన్నుల చెత్తంతా పేరుకుపోయింది. కుళ్లిపోయిన వ్యర్థాల నుంచి తీవ్ర దుర్వాసనతో వచ్చేది. కూటమి ప్రభుత్వం రావడంతోనే 2.50 లక్షల టన్నుల వ్యర్థాలను ప్రత్యేక యంత్రాలతో ప్రాసెస్‌చేసి 55శాతం వర్మికంపోస్ట్‌గా మార్చారు. ఎయిమ్స్‌కు వెళ్లే దారి.. స్వచ్ఛంగా మారింది. ప్రస్తుతం మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో తడి వ్యర్థాలతో వర్మికంపోస్ట్ తయారుచేసే 10 షెడ్‌లు, డ్రై వేస్ట్ నిర్వహణకు రెండు సెంటర్‌లు ఏర్పాటుచేశారు. మిగిలిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు జిందాల్‌కు తరలిస్తూ.. ఎక్కడా చెత్త కనిపించకుండా చర్యలు తీసుకున్నారు. - ఈనాడు అమరావతి



నాడు ఎయిమ్స్ ఆస్పత్రి వెళ్లే దారిలో లక్షలాది టన్నుల్లో వ్యర్థాలు పేరుకుపోయి ఇలా..



నేడు చెత్తంతా ప్రాసెస్ చేసి తరలించడంతో..

దుర్గమ్మకు బంగారు జడ విరాళం



కుటుంబసభ్యులతో కలిసి జడను తీసుకు వస్తున్న దాత రాధాకృష్ణ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: జగన్మాత దుర్గమ్మ అలంకరణ నిమిత్తం రూ.11లక్షల విలువైన బంగారు జడను దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ(గాంధీ) కుటుంబం ఆదివారం విరాళంగా అందజేశారు. లక్ష్మీదేవి, ఇతర దైవిక రూపాలు కలిగిన బంగారు జడలో ఆకుపచ్చ రంగు విలువైన రాళ్లు, ముత్యాలు పొదిగి ఉన్నాయి. ఈ సందర్భంగా ఛైర్మన్ రాధాకృష్ణ మాట్లాడుతూ.. 20 ఏళ్ల క్రితం దుర్గగుడికి వచ్చినప్పుడు అమ్మవారికి బంగారు జడ చేయించాలన్న ఆలోచన వచ్చిందన్నారు. అప్పుడు చేసిన సంకల్పం దుర్గగుడి ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కుటుంబ సభ్యులు, మిత్రుల సహకారంతో అమ్మవారి మొక్కును విజయవంతంగా నెరవేర్చిన సంతృప్తి కలిగిందన్నారు. ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తనతో పరిచయం ఉన్న మిత్రులు స్వచ్ఛందంగా శివాలయం అభివృద్ధి, అన్నదానం, ఉచిత ప్రసాదం, బంగారం, వెండి ఆభరణాలు, గోసంరక్షణ పథకాలకు రూ.1.16 కోట్ల విరాళాలు తన హయాంలో అమ్మవారి ఆలయానికి అందజేశారని తెలిపారు. మరో 15 రోజుల్లో రూ.75లక్షల విలువ చేసే బంగారు కిరీటం(డైమండ్స్ పొదిగిన) అమ్మవారికి విరాళంగా ఇచ్చేందుకు తన మిత్రుడు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. దేవస్థానం ఈవో శీనానాయక్, స్థానాచార్య శివప్రసాదశర్మ, ప్రధానార్చకులు దుర్గాప్రసాద్, వైదిక కమిటీ సభ్యులు కోట ప్రసాద్, శ్రీధర్‌శర్మ, ఈఈ రమాదేవి, పాలకమండలి సభ్యులు అవ్వారు శ్రీనివాసరావు, రాఘవరాజు, సరిత తదితరులు పాల్గొన్నారు.

చలో గుంటూరు సెప్టెంబరు 1న

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన హక్కుల సాధన కోసం ఏపీ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఉద్యోగుల సంఘం (ఏపీ సీపీఎస్ ఈఏ) ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న 'చలో గుంటూరు- సమర శంఖం' పేరిట పోరాటం చేస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాజీపఠాన్, కరిమి రాజేశ్వరరావులు ఓ ప్రకటనలో తెలిపారు. విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు, ఉద్యోగుల ఆర్థిక, సామాజిక భద్రత వంటి ప్రధాన సమస్యలపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలన్న తదితర డిమాండ్‌లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. పింఛను సమస్యను ఇకపై కాలయాపన చేయకుండా తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేయనున్నట్లు తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం ఏకగ్రీవం



ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

జిల్లా పరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం నగరంలోని గ్రామీణ గుంటూరు మండల పరిషత్తు సమావేశ మందిరంలో ఎన్నికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడుగా సి. హెచ్. వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా పి. నాగరాజు, కోశాధికారిగా టి. శ్రీనివాసరావు, సహాధ్యక్షుడిగా ఎ. సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా ఆర్. వి. సింగరయ్య, డి. సుబ్రహ్మణ్యం, ఎం. ఎస్. నాగేంద్రం, ఆరాధ్యుల దుర్గా కోటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శులుగా టి. సాంబశివరావు, బి. మధుసూదనరావు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా కొమిరిశెట్టి నాగేశ్వరరావు, వి. ఎస్. వి. ప్రసాద్ ఎన్నికయ్యారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అధ్యక్షుడు, కార్యదర్శి తెలిపారు.



సత్కారం అందుకున్న రైతులతో మానవత ప్రతినిధులు

జయహో అన్నదాత

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: రైతు కేవలం పంటను మాత్రమే కాదు దేశ భవితను పండిస్తారని, ఈ క్రమంలో ఎన్నో ఆటుపోట్లను తట్టుకుని ముందుకు సాగుతూ సమాజానికి స్ఫూర్తినిస్తున్నారని వక్తలు పేర్కొన్నారు. మానవత సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం తెనాలి పరిసర ప్రాంతాలకు చెందిన 26 మంది ఆదర్శ రైతులను ఘనంగా సత్కరించిన వేడుకకు తహసీల్దార్ గోపాలకృష్ణ, డాక్టర్ నన్నపనేని ప్రతాప్, కొత్త సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రైతుల సేవలను కొనియాడారు. చక్కటి కార్యక్రమాన్ని నిర్వహించారంటూ సంస్థ ప్రతినిధులను అభినందించారు. తెనాలి గౌతమ్ గ్రాండ్ వేదికగా జరిగిన వేడుకలో సత్కార గ్రహీతలైన పలువురు రైతులు తమ ప్రస్థానాన్ని వివరించారు. సంస్థ ఛైర్మన్ డాక్టర్ కొలసాని రాంచంద్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో హరీష్, ఓంకార్ ప్రసాద్, వాసు, సోమయ్యశాస్త్రి, ఎస్‌వి. శర్మ, మొవ్వా సత్యనారాయణ, వెంపటి సత్యనారాయణ, ఆలపాటి వెంకట్రామయ్య, అయినాల మల్లేశ్వరరావు, వెంకట్, రాంబాబు, శోభారాణి, రోహిణి తదితరులతోపాటు పెద్ద సంఖ్యలో మానవత ప్రతినిధులు, రైతుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. మానవత సభ్యులు, రైతులకు హెల్త్ హాస్పిటల్స్ ప్రివిలేజ్ కార్డులు అందిస్తామని, వాటి ద్వారా ప్రతి ఏటా ఉచిత వైద్య పరీక్షలతోపాటు అన్ని రకాల సేవల్లోనూ 20 శాతం రాయితీ ఉంటుందని డాక్టర్ నన్నపనేని ప్రతాప్ ప్రకటించారు. పలువురికి కార్డులు అందించారు.

పంట కాలువలకు నీరు విడుదల

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : బ్యారేజీ నుంచి పంట కాలువలకు ఆదివారం 9,302 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కృష్ణా తూర్పు కాలువకు 5,118, పశ్చిమకు 4,012, గుంటూరు ఛానల్‌కు 172 క్యూసెక్కులు ఇస్తున్నారు. తూర్పు కాలువ నుంచి రైవస్ కాలువకు 2,005, ఏలూరుకు 1,302, కేఈబీకి 906, బందరు కాలువకు 905 క్యూసెక్కులిచ్చారు. బ్యారేజీ వద్ద 12 అడుగుల మట్టం ఉంది.

జాతీయ సదస్సుకు హాజరు

నగరంపాలెం, న్యూస్‌టుడే : ప్రతిష్ఠాత్మక ఎండోకాన్-2026 జాతీయ సదస్సులో గుంటూరు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగూర్‌బాషా ఫ్యాకల్టీగా హాజరయ్యారు. శనివారం దిల్లీలో నిర్వహించిన సదస్సుకు గుంటూరు నుంచి ఏకైక వ్యక్తిగా పాల్గొన్నారు. గ్యాస్ట్రోఎంటరాలజీలో నూతన ఆవిష్కరణలపై ప్రసగించినట్లు ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రముఖ వైద్య నిపుణుల సమక్షంలో ఫ్యాకల్టీగా పాల్గొనడం గర్వకారణంగా ఉందన్నారు.



డాక్టర్ నాగూర్‌బాషా

కానిస్టేబుళ్ల సస్పెన్షన్

మాచర్ల పట్టణం: విదేశీయుడి పాస్‌పోర్టు పునరుద్ధరణకు రూ.5 లక్షలు డిమాండ్ చేసిన వ్యవహారంలో ఇద్దరు కానిస్టేబుళ్లను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. మాచర్లలో బంగ్లాదేశ్ దేశానికి చెందిన వ్యక్తి పాస్‌పోర్టు గడువు ముగియడంతో పునరుద్ధరణకు దరఖాస్తు చేసుకున్నారు. కానిస్టేబుళ్లు డబ్బులు తీసుకున్నట్లు బాధితుడు ఉన్నతాధికారుల విచారణలో తెలిపారు. దీంతో మాచర్లలో పనిచేస్తున్న ప్రత్యేక విభాగానికి చెందిన కానిస్టేబుల్‌తో పాటు జిల్లా కార్యాలయంలో అతనికి సహకరించిన మరో కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ అధికారులు చర్యలు తీసుకున్నారు. మాచర్ల కానిస్టేబుల్‌పై ఇదివరకే ఉన్న అవినీతి ఆరోపణలతోపాటు వైకాపా నాయకులకు పోలీసు శాఖకు చెందిన సమాచారాన్ని చేరవేశారన్న దానిపై కూడా విచారించినట్లు తెలిసింది.

చిన్నపరెడ్డి సేవలు మరువలేం



ప్రసంగిస్తున్న రాష్ట్ర ఆడిట్ సంచాలకులు ఈదర కల్యాణి

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: విజయవాడ నగరపాలక సంస్థలో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న చిన్నపరెడ్డి సేవలను మరువలేమని రాష్ట్ర ఆడిట్ సంచాలకులు ఈదర కల్యాణి అన్నారు. సోమవారం చిన్నపరెడ్డి ఉద్యోగ విరమణ చేయనున్న నేపథ్యంలో ఆదివారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆడిట్ అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర ఆడిట్ సంచాలకులు కల్యాణి మాట్లాడుతూ చిన్నపరెడ్డి యువతతో పోటీపడి పనిచేశారని అన్నారు. ఆడిట్ శాఖలోని పలు సమస్యలను ఆయన చాలా సులువుగా పరిష్కరించేవారని గుర్తు చేశారు. తెలంగాణ ఆడిట్ శాఖ మాజీ ఉపసంచాలకులు వేణుగోపాల్ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుంటూరు, విజయవాడ నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధుల నిర్వహణ



నాగరాజు దంపతులను సన్మానిస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే : విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన జిల్లా పరిషత్తు హెచ్‌ఆర్ విభాగం పరిపాలన అధికారి (ఏవో) ఎల్. ఎస్. టి. నాగరాజు సేవలు అభినందనీయమని జడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. ఏవోగా ఉద్యోగ విరమణ చేసిన నాగరాజు అభినందన వీడ్కోలు సభ ఆదివారం జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో నిర్వహించారు. నాగరాజు, హిమబిందు దంపతులను ఛైర్‌పర్సన్ క్రిస్టినా, సురేష్‌కుమార్ దంపతులు, డిప్యూటీ సీఈవో సి. హెచ్. కృష్ణ, గణాంక అధికారి పి. శామ్యూల్‌పాల్, జిల్లా పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు నిర్మల భారతి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఉద్యోగులు పాల్గొన్నారు.

జిల్లా ఉషు ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ



క్రీడాకారులతో సంఘ సభ్యులు

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే : గుంటూరు జిల్లా ఉషు అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్, సీనియర్ జిల్లా ఛాంపియన్‌షిప్ పోటీలు బీఆర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించినట్లు అధ్యక్షులు బి. బ్రహ్మయ్య తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులకు రాష్ట్ర కార్యదర్శి బండి నరసింహారావు పతకాలు అందజేసి అభినందనలు తెలిపారు.

జూనియర్ విభాగం : కె. శ్రీసత్యవాణి, సయ్యద్ అంజున్ జువేరియా, ఎస్. కె. జైనుల్లా బుద్దీన్, వై. జశ్వంత్‌కుమార్, ఎ. సాయిదేవ సాత్విక్, ఎం. వెంకి, వై. భవ్యసత్యశ్రీ.

సీనియర్ విభాగం : డి. హనోక్, బి. చైతన్యకుమార్, ఎ. యోగేష్ విశ్వనాథ్, పి. పాలయ్య, ఎ. విజయ్‌కృష్ణ, కె. శ్రీనివాస్, ఎస్. కె. షీనా, పి. శ్యామ్ చరణ్, ఎస్. కె. జాన్‌సైదా, వి. నాగేశ్వరరావు పతకాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు బి. సాయి మోహన్‌కుమార్, ఎం. కిరణ్‌కుమార్, అసోసియేషన్ సభ్యులు ఎస్. కె. కరిముల్లా, పి. వీరయ్య, కె. కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎనిమిదికి చేరిన మృతులు

గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మహిళ మృతి



సుబ్బులు (పాతచిత్రం)

చిలకలూరిపేట గ్రామీణ, గుంటూరు (నగరంపాలెం), న్యూస్‌టుడే : పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణంలో అడ్డరోడ్డు వద్ద ఆటోను ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొన్న ప్రమాదంలో మృతుల సంఖ్య ఎనిమిదికి పెరిగింది. ఈనెల 26న అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో చిలకలూరిపేట మండలం వేలూరు ఎస్సీ కాలనీకి చెందిన ఏడుగురు మృతి చెందగా మరో ఎనిమిది మంది గాయపడిన విషయం తెలిసిందే. గుంటూరు సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల్లో చౌటుపల్లి సుబ్బులు (55) శనివారం అర్ధరాత్రి మృతి చెందింది. పోస్టుమార్టం అనంతరం ఆమె మృతదేహాన్ని గుంటూరు నుంచి వేలూరు గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మృతురాలి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సానుభూతి తెలిపారు. ప్రభుత్వపరంగా వారి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామన్నారు.

ఒకే కుటుంబంలో నలుగురు.. ఈ సంఘటన ఒకే ఇంట్లో తీరని దుఃఖాన్ని మిగిల్చింది. వేలూరు ఎస్సీ కాలనీలో రామయ్య భార్య సువార్త, తల్లి లక్ష్మమ్మ, చిన్న అక్క గంగమ్మ ప్రమాదం జరిగిన రోజే మృతి చెందగా ఆదివారం పెద్ద అక్క సుబ్బులు చికిత్స పొందుతూ మృతి చెందింది. ప్రమాద రూపంలో నలుగురు కుటుంబ సభ్యులను కోల్పోయిన రామయ్య దిక్కుతోచని స్థితిలో ఉండిపోయాడు. పెళ్లయిన కుమారుడు, కుమార్తె ఉన్నప్పటికీ తన తల్లి, భార్య, తోబుట్టువులను కోల్పోయానని రామయ్య తల్లడిల్లిపోతున్నాడు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

ముగ్గురికి తీవ్ర గాయాలు

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణ శివారున ద్విచక్ర వాహనాన్ని చీరాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆదివారం రాత్రి ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గుంటూరుకు చెందిన బయ్యా పూర్ణేష్, ధూళిపాళ్ల సాయి హర్షవర్ధన్, చల్లగాలి వెంకటేష్ ద్విచక్ర వాహనంపై వేటపాలెం మండలం రామాపురంలో విద్యుత్తు పనిచేసి వస్తున్నారు. తిరుగు ప్రయాణంలో గుంటూరు వెళ్తున్న వీరి మోటార్ సైకిల్‌ను పట్టణ శివారు ఎంఆర్ నగర్ వద్ద విజయవాడ నుంచి బాపట్ల వస్తున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు ఎదురుగా ఢీకొట్టింది. ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఎదురుగా వచ్చిన ఆటోను బస్సు డ్రైవర్ తప్పించే క్రమంలో ఈ ఘటన జరిగింది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న వెంకటేష్‌ను మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో గుంటూరు సర్వజన ఆసుపత్రికి పంపించారు. ఘటనపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

కారును ఢీకొన్న మినీ లారీ

నలుగురికి గాయాలు



దెబ్బతిన్న కారు, మినీ లారీ

గాయపడిన కిరణ్, చికిత్స పొందుతున్న తులసి

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: కర్నూలు గుంటూరు జాతీయ రహదారిపై చీకటీగలపాలెం వద్ద సర్వీసు రోడ్డులో వేగంగా ప్రయాణిస్తున్న మినీ లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన ఇనుప గ్రిల్స్‌ను దాటుకుని పక్క రోడ్డులో వెళ్తున్న కారును ఢీకొనడంతో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వినుకొండలో ఓ దుకాణం నుంచి పాత కాగితాలు, ప్లాస్టిక్ సామాన్లను మినీ లారీలో నింపి బిహార్‌కు చెందిన డ్రైవర్ మార్కాపురం వైపు ఆదివారం వెళ్తున్నాడు. అదే సమయంలో గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన యన్నం కిరణ్, రావుల అజయ్, తులసి, త్రినాథ్ శ్రీశైలంలో పెళ్లి పనులు ముగించుకుని కారులో స్వగ్రామం వస్తున్నారు. వేగంగా ప్రయాణిస్తున్న మినీ లారీ అదుపు తప్పి సర్వీసు రోడ్డు దాటి మధ్యలో ఉన్న ఇనుప గ్రిల్స్ మీదుగా దూసుకెళ్తూ పక్కన ప్రధాన రోడ్డులోకి వచ్చి అటుగా వెళ్తున్న కారును బలంగా ఢీకొంది. ప్రమాదంలో కారు ధ్వంసమైంది. అందులో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలై కారులోనే ఇరుక్కుపోయారు. గ్రామస్థులు వచ్చి అద్దాలు పగలగొట్టి వారిని బయటకు తీసి 108లో వినుకొండ వైద్యశాలకు తరలించారు. రోడ్డుకు అడ్డంగా లారీ, మరో వైపు కారు నిలిచిపోవడంతో రెండు వైపులా వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు వచ్చి లారీని పక్కకు తీయించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. లారీ డ్రైవర్ మద్యం తాగి ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. అతన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పుల్లారావు తెలిపారు.

మిస్టరీగా వ్యాపారి అదృశ్యం కేసు

తెనాలి టౌన్: వ్యాపారి అదృశ్యం కేసు మిస్టరీగా మారింది. తెనాలి గ్రామీణ పోలీసులు ఆదివారం తెలిపిన సమాచారం మేరకు విజయవాడకు చెందిన 53 సంవత్సరాల కోటి నాగవీరయ్య పాలిష్ తయారీ, విక్రయ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. భార్యాపిల్లలతో విజయవాడలోనే నివసించేవారు. ఈ క్రమంలోనే ఆయనకు స్థానిక మహిళతో పరిచయం ఏర్పడింది. రెండేళ్ల నుంచి ఆమెతో కలిసి తెనాలిలో నివసిస్తున్నారు. రెండు నెలల క్రితం వ్యాపారాన్ని కూడా తెనాలికి మార్చేసి ఇక్కడే ఉంటున్నారు. శనివారం మధ్యాహ్నం భోజనం చేసి ద్విచక్ర వాహనంపై దుకాణానికి బయలుదేరారు. రాత్రి సిబ్బంది ఇంటికి వచ్చి షాపు తాళాలు ఇచ్చి, యజమాని మధ్యాహ్నం నుంచి రాలేదని చెప్పారు. దీంతో ఆ మహిళ రాత్రంతా అతని కోసం పరిసర ప్రాంతాల్లో వెతికారు. ఆదివారం ఉదయం ఆటోనగర్ మార్గంలోని శ్మశానం, చెరువు పరిసరాల్లో రోడ్డు వెంబడి నాగవీరయ్య వాహనం, చెప్పులు ఉన్నట్లు తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడిని ఎవరో కారులో ఎక్కించుకుని వెళ్లారని స్థానికులు చెబుతున్నారు. కిడ్నాప్ ఏమైనా జరిగిందా? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. విజయవాడకు చెందిన భార్య, తన భర్త ఇంటికి రాకుండా తెనాలిలో మరో మహిళతో సహజీవనం చేస్తున్నట్లు గతంలో విజయవాడలోని ఆర్‌ఆర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం సాయంత్రం తెనాలి గ్రామీణ సర్కిల్ కార్యాలయానికి భార్య, సహజీవనం చేస్తున్న మహిళ, వారి బంధువులు వచ్చారు. పోలీసులు వారందరినీ విచారించారు. దర్యాప్తు కొనసాగుతోంది.

అంబటిని ఫోన్లో పరామర్శించిన జగన్

నగరంపాలెం, న్యూస్‌టుడే : ఇటీవల అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న మాజీ మంత్రి, వైకాపా జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబును వై. ఎస్. జగన్ ఆదివారం ఫోన్లో పరామర్శించారు. అంబటి.. తన ఆరోగ్య సమాచారాన్ని వివరించారు. గుండెకు రెండు స్టంట్లు వేశారని, ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. త్వరగా కోలుకోవాలని జగన్ ఆకాంక్షించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 120, రిటైల్ ధర - 147, చికెన్ విత్‌స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 257.

కృష్ణా జిల్లాలో వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 228 చికెన్ స్కిన్‌లెస్ - 257.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

బెయిల్‌పై ముస్తఫా విడుదల

నగరంపాలెం, న్యూస్‌టుడే : పొగాకు వ్యాపారి కుమారుడి అపహరణ, బెదిరింపు కేసుల్లో నెల్లూరు జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ ఎమ్మెల్యే ముస్తఫా ఆదివారం బెయిల్‌పై జైలు నుంచి విడుదలయ్యారు. వైకాపా శ్రేణులు మిర్చి యార్డు నుంచి ఆ పార్టీ కార్యాలయానికి ర్యాలీగా తీసుకొచ్చారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త, ముస్తఫా కుమార్తె నూరి ఫాతిమా గజమాలతో తండ్రికి స్వాగతం పలికారు. అనంతరం ఆయన పార్టీ నాయకులతో కొద్దిసేపు ముచ్చటించి. మంగళ్‌దాసు నగర్‌లోని నివాసానికి చేరుకున్నారు. నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేక వెంకట ప్రతాప్ అప్పారావు కలిసి సంఘీభావం తెలిపారు. వైకాపా నాయకుల ర్యాలీతో నగరంలో ఏర్పడిన ట్రాఫిక్‌తో ప్రజలు ఇబ్బందిపడ్డారు.

అలరించిన భువన విజయం

విజయవాడ సాంస్కృతికం : దృశ్య వేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం ప్రదర్శించిన 'భువన విజయం' నాటకం అలరించింది. శ్రీకృష్ణదేవరాయలుగా అంబటి మధుమోహనకృష్ణ, తిమ్మరుసుగా యల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి, అల్లసాని పెద్దనగా గుమ్మా సాంబశివరావు తదితరులు తమ పాత్రలను చక్కగా పోషించారు తెలుగు భాషా సాహిత్య వైభవాన్ని భావితరాలకు పరిచయం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్టు నిర్వాహకులు తెలిపారు.

తెనాలి

•తెనాలి •పొన్నూరు

గంగానమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



తక్కెళ్లపాడు (పెదకాకాని), న్యూస్‌టుడే: తక్కెళ్ల పాడు గ్రామ చెరువు ఒడ్డున ఉన్న గంగానమ్మ తల్లికి ఆదివారం రజక సోదరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి పొంగళ్లు సమర్పించారు. భక్తి శ్రద్ధలతో అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారికి ఊరేగింపు చేశారు. వర్షాలు కురిసి ప్రజలందరూ పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని కోరుతూ ఈ పూజలు నిర్వహించినట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

మల్లేశ్వరస్వామి దేవస్థానానికి విరాళం అందజేత



ఆలయ ఛైర్మన్‌కు నగదు అందిస్తున్న దాతలు

పెదకాకాని, న్యూస్‌టుడే: పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానానికి ఆదివారం పొన్నూరుకు చెందిన చేబ్రోలు సాంబశివరావు తన భార్య నాగ శివకోటేశ్వరి జ్ఞాపకార్థం రూ.50 వేల నగదు విరాళంగా అందజేశారు. ఆలయ ఛైర్మన్ కొసూరి పూర్ణచంద్రరావుకు ఈ మొత్తాన్ని అందించారు. భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామివారికి నిర్వహించిన ప్రత్యేక అభిషేక పూజల్లో దాతలు పాల్గొన్నారు. అనంతరం అర్చకులు వారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? పట్టణ పరిధిలోని బాలాజీనగర్‌లో వీధి దీపం వెలగడం లేదు. రాత్రి సమయంలో రాకపోకలు నిర్వహించడం చాలా ఇబ్బందికరంగా ఉంది. **-పి.రాంబాబు, బాలాజీనగర్.** ✔ బాగు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. **-సాయి, సహాయ ఇంజినీర్.**

? పొన్నూరు పట్టణ పరిధిలోని 26వ వార్డులోని మురుగు కాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయి. -కల్యాణ్‌బాబు, 26వ వార్డు. ✔ వ్యర్థాలను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం. **-పోతురాజు, ప్రజారోగ్యశాఖాధికారి.**

స్పందన: 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన ఈనాడులో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పొన్నూరు పట్టణ పరిధిలోని 19వ వార్డులో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. - న్యూస్‌టుడే, పొన్నూరు.

ఆదాయం వైపు.. అతివల అడుగులు

న్యూస్‌టుడే, పొన్నూరు: పొదుపు సంఘాల్లో భాగమైన మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం, బ్యాంకులు తక్కువ వడ్డీకే రుణాలు మంజూరు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ మేరకు బ్యాంకు నుంచి వచ్చిన డబ్బును సొంత ప్రయోజనాల కోసం కాకుండా ఏదైనా వ్యాపారం ప్రారంభించేందుకు ఉపయోగించుకోవాలని సభ్యులను ఇప్పటికే మెప్మా అధికారులు ప్రోత్సహిస్తున్నారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఆసరాగా నిలుస్తున్నారు.

★ అధికారిక సమాచారం ప్రకారం పొన్నూరు మెప్మా విభాగంలో 1710 పొదుపు సంఘాలు ఉండగా 17,250 మంది సభ్యులు వాటిల్లో భాగమయ్యారు. బ్యాంకు నిబంధనల మేరకు పొదుపు సంఘ సభ్యులకు రూ.10 లక్షలు, రూ.15 లక్షలు, రూ.20 లక్షల వరకు అధికారులు రుణాలు మంజూరు చేస్తున్నారు. ఆ డబ్బుతో వ్యాపారాలు చేసే విధంగా మెప్మా అధికారులు ప్రోత్సాహం కల్పిస్తున్నారు. తమ కుటుంబ ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలనే ఆకాంక్షతో పొదుపు సంఘ సభ్యులు వివిధ రకాల వ్యాపారాలు చేస్తూ ఆర్థిక అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నారు.



సమావేశంలో పొదుపు సంఘ సభ్యులు (పాతచిత్రం)

★ బ్యాంకు రుణాలతో వ్యాపారాలు ప్రారంభించిన కొంత మంది పొదుపు సంఘ సభ్యులు నెలకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఆదాయం సంపాదిస్తున్నట్లు మెప్మా అధికారులు చెబుతున్నారు. బ్యాంకుల్లో తీసుకున్న రుణాలతోపాటు పొదుపు సంఘ సభ్యులు ప్రతి నెలా కొంత మొత్తాన్ని పొదుపు పేరుతో జమ చేస్తున్నారు. అత్యవసర సమయంలో దానిని ఉపయోగించుకుంటున్నారు. ఇది తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని మహిళలు పేర్కొంటున్నారు. తక్కువ వడ్డీకి పొందిన రుణాలను పెట్టుబడిగా పెట్టి ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నామని పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రుణాలతో వ్యాపారాల నిర్వహణ

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి: సజ్జా వెంకట శివ నాగేశ్వరమ్మ, సీఎంఎం.



పొదుపు సంఘ సభ్యులకు బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తున్నాం. బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను వ్యక్తిగత అవసరాలకు వినియోగించుకోకుండా ఏదైనా వ్యాపారం చేసుకోవాలని సభ్యులను చైతన్య పరుస్తున్నాం. ఎక్కువ మంది మహిళలు వారికి నచ్చిన వ్యాపారం చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించడానికి ప్రభుత్వం కూడా తగు సూచనలు చేస్తుంది. ఆ సూచనలను క్షేత్ర స్థాయిలో అమలు చేయడంతో గతంలో కన్నా మంచి ఫలితాలు సాధిస్తున్నాం.

ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని ఎమ్మెల్సీకి వినతి



ఆలపాటి రాజాతో ఒప్పంద అధ్యాపకులు

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఒప్పంద అధ్యాపకులు వినతి పత్రం అందించారు. గుంటూరులోని ఎమ్మెల్సీ కార్యాలయంలో ఒప్పంద అధ్యాపకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. విశ్వవిద్యాలయంలో 15 ఏళ్లకు పైగా పనిచేస్తున్నా సమాన పనికి సమాన వేతనం దక్కడం లేదని ఆయనకు తెలిపారు. వారి సమస్యలను విన్న ఆయన విద్యాశాఖాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. యూజీసీ అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులతో చెప్పారు. అనంతరం వీసీ ఆచార్య గంగాధర్‌తో ఆయన మాట్లాడారు. ఒప్పంద అధ్యాపకుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఒప్పంద అధ్యాపకులు అఖిలా జాన్, ప్రతిభ, రవి, రాజాజీ, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని ప్రార్థనలు



ఈద్గా ప్రాంగణంలో ముస్లిం సోదరులు

పొన్నూరు, న్యూస్‌టుడే: ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సరిగా కురవకపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని, వర్షాలు బాగా కురవాలని కోరుతూ పొన్నూరు ఈద్గా ప్రాంగణంలో ఆదివారం ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి రైతుల పంటలు పండాలని, ప్రజలకు కష్టాలు తొలగాలని మత పెద్దలు కోరారు.

ఒత్తిడితోనే ఆరోగ్య సమస్యలు



శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ పావని ప్రియాంక

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఒత్తిడి వల్ల గుండె సంబంధిత ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని, ఒత్తిడి నియంత్రణ, తొలి దశలోనే సమస్యను గుర్తించడం ద్వారా అధిక నష్టం జరగకుండా చూసుకోవచ్చునని వైద్యులు తెలిపారు. సాయిమంగా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పురపాలక బాలురోన్నత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించి సలహాలు, మందులు అందించారు. డాక్టర్ పావని ప్రియాంక శిబిరాన్ని ప్రారంభించగా, డాక్టర్ అజయ్, డాక్టర్ మంజూష, సిబ్బంది సేవలు అందించారు. సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు రమేష్‌కుమార్ పర్యవేక్షించగా శిబిరానికి పెద్ద సంఖ్యలో స్థానికులు హాజరయ్యారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



కరపత్రాలు అందజేస్తున్న తెదేపా నేతలు

పొన్నూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పుర ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అధిక ప్రాధాన్యత కల్పించారని తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ బాజీ పేర్కొన్నారు. ఆదివారం పట్టణ పరిధిలోని 5వ వార్డులో రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి సంక్షేమం కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సాధించిన సంక్షేమ విజయాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైకాపా పాలనలో పొన్నూరు పురపాలక సంఘంలో అభివృద్ధి పేరు చెప్పి ఆనాటి నేతలు దోపిడీ చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పట్టణ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా రూ.15 కోట్లు కేటాయించారని వెల్లడించారు. కార్యక్రమంలో తెదేపా నేతలు పఠాన్, అమీద్, జానీబాషా, తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి పథంలో కాకతీయ కోఆపరేటివ్ సొసైటీ



యాప్‌ను ప్రారంభిస్తున్న ఛైర్మన్ చక్రధర చౌదరి

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: ఖాతాదారుల ఆదరణతో తమ సంస్థ ప్రధాన కార్యాలయం, మరో పది శాఖలతో ప్రగతి పథంలో నడుస్తోందని కాకతీయ కో ఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ దావులూరి చక్రధర చౌదరి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించిన ది కాకతీయ కోఆపరేటివ్ సొసైటీ తెనాలి రజతోత్సవం, సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డిపాజిట్లపై ఇస్తున్న పది శాతం వడ్డీకి ఖాతాదారుల స్పందన బాగుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సొసైటీ మొబైల్ యాప్‌ను, గౌరవాధ్యక్షుడు దావులూరి లక్ష్మీకాంతారావు వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. కళాకారుడు పాతూరి సుబ్రహ్మణ్యంను గౌరవాధ్యక్షుడు లక్ష్మీకాంతారావు సత్కరించారు. కార్యక్రమంలో మారౌతు సీతారామయ్య, షేక్ ఖలీల్, కె.వాసుదేవ నాయుడు, పి.ఎస్.ఆర్.బ్రహ్మాచార్యులు, వై.వి.రంగనాథ్, ఎ.పోతురాజు, పి.సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

వృద్ధులను గౌరవించాలి



న్యాయవాదిని సత్కరిస్తున్న ప్రతినిధులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: మారుతున్న సామాజిక పరిస్థితుల నేపథ్యంలో పెద్దలు తమ మనుగడకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని, అయితే సీనియర్ సిటిజన్స్ యాక్ట్ వారికి రక్షణ కల్పిస్తుందని, హక్కుల సాధనకు ఆయుధంగా ఉపయోగపడుతుందని ప్రముఖ న్యాయవాది పరాంకుశం అనంత్ తెలిపారు. వాకర్స్ క్లబ్ తెనాలి-2 ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం సాయంత్రం పెద్దలతో నిర్వహించిన సమావేశంలో ఆయన చట్టపరమైన అంశాలను వివరించారు. సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు, పారా లీగల్ వాలంటీర్ వేజళ్ల ఉమామహేశ్వర్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ఆనందరావు, భుజంగరావు, శివనాగేశ్వరరావు, సుబ్బారావు, సత్యనారాయణ, రవి, సత్యనారాయణరాజు, పెద్ద సంఖ్యలో ప్రతినిధులు పాల్గొన్నారు. పి.అనంత్‌ను జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.

సామాజిక సేవలు స్ఫూర్తిదాయకం



వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఎస్‌ఆర్ అండ్ ఎస్‌ఆర్ స్వచ్ఛంద సంస్థ ద్వారా అన్నం పిన్నారావు చేస్తున్న సామాజిక సేవలు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. అత్యవసర వైద్య సేవలకు ఉచిత రవాణా సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన వ్యాన్, బాలికలకు ఉచితంగా శానిటరీ ప్యాడ్స్ అందించే కేంద్రాన్ని ఆయన ఆదివారం పట్టణ 17వ వార్డులో ప్రారంభించారు. తెదేపా నాయకులు ఖుద్దూస్, త్రిమూర్తి, రమాదేవి, మల్లేశ్వరి, అశోక్ తదితరులతోపాటు పెద్ద సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోలీసుల చర్యలు



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని ఉన్నత పాఠశాలల వద్ద పహారాతోపాటు ఆయా ప్రాంతాల్లో అనవసరంగా తిరిగే యువతని గుర్తించి, కౌన్సెలింగ్ నిర్వహించడాన్ని పోలీస్ విభాగం కొనసాగిస్తుంది. 'ఈనాడు-మీతోడు' కార్యక్రమంలో భాగంగా జులై 30న నిర్వహించిన డయల్ యువర్ సీఐ కార్యక్రమంలో గ్రామీణ సర్కిల్ సీఐ షేక్ నాయబ్‌రసూల్ ప్రజలతో ఫోన్‌లో మాట్లాడారు. వారి సమస్యలు, సూచనలు నమోదు చేసుకున్నారు. సమస్యల పరిష్కారాల్లో భాగంగా ఉన్నత పాఠశాలల విద్యార్థులతో ఆయా ప్రాంతాల సీఐలు, ఎస్సైలు మాట్లాడారు. సమస్యలు ఎదురైతే ఫోన్ చేయండంటూ నంబర్లు ఇచ్చారు. బహిరంగ మద్యపానం జరుగుతున్న ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కేసులు నమోదు చేశారు. నాలుగు వరుసల రోడ్డు, గంగానమ్మపేట, చెంచుపేట పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు.

కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు

మంగళగిరి టౌన్, న్యూస్‌టుడే : కరాటే సాధనతో క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యంతో పాటు ఆత్మరక్షణకు ఎంతో ఉపయోపడుతుందని ఎయిమ్స్ పరిపాలన విభాగం వైద్యులు శుభోదీప్ మిత్ర అన్నారు. మంగళగిరి స్వేచ్ఛ బుద్ధవిహార్‌లో జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో క్యూలెవల్ బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు ఆదివారం నిర్వహించారు. టెస్ట్‌లో 9వ క్యూ బెల్ట్‌ను సంవర్ధన్ మిత్ర, సీహెచ్.వాసవిసాయి దుర్గ, రిషిక, మహరీన్, రిద్విన్, పర్ణిక, ఎన్.దుర్గాకల్యాణ్ సాధించగా, 8వ క్యూ బెల్ట్‌ను జిగ్నేష్, వీక్షశ్రీ, యశ్వంత్, 6వ క్యూ బెల్ట్‌ను జ్ఞానేశకార్తీక్ సాధించారు. జపాన్ కరాటే అసోసియేషన్ ఏపీ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్, ఎగ్జామినర్ కొడాలి రవిబాబు, జోనల్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ సాగరిక పాల్గొన్నారు.

ప్రయత్నం బాగు.. కొనసాగింపులో జాగు

శిక్షణ కార్యక్రమాల పునరుద్ధరణలో జాప్యం

న్యూస్‌టుడే, తెనాలి (కొత్తపేట)



సంచుల తయారీలో మహిళలు

మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో వారికి పలు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. తెనాలి పురపాలక పరిధిలోని కొత్తపేట మహిళా మండలి భవనంలో కుట్టు, కాగితాలతో సంచుల తయారీ వంటి వాటిల్లో శిక్షణ ఇచ్చారు. సుమారు 1000 మంది మహిళలు ఇక్కడ తర్ఫీదు పొంది, డబ్బు సంపాదనలో భాగమయ్యారు. ఈ తరగతులు తమకు ఎంతగానో ఉపయోగపడ్డాయని తెలిపారు. అయితే, కొన్ని నెలల పాటు సక్రమంగా సాగిన ఈ శిక్షణ కార్యక్రమాలు ఇప్పుడు మాత్రం కొనసాగడం లేదు. కొనసాగింపులో జాప్యంపై స్థానిక మహిళలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి చొరవతో..: రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ గతేడాది పట్టణంలో పర్యటించిన సమయంలో తాము ఖాళీగా ఉంటున్నామని, ఉపాధి చూపించాలని పలువురు స్థానిక మహిళలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. మహిళల ఆసక్తిని గ్రహించిన ఆయన వారి ఆర్థిక ప్రగతికి సంకల్పించారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న దుస్తులు కుట్టడంలో శిక్షణ ఇప్పించాలని భావించారు. ఈ మేరకు అపార అనుభవం కలిగిన హైదరాబాద్‌కు చెందిన మహిళా శిక్షకురాలిని తెనాలికి పిలిపించారు. కుట్టు, కాగితాలతో సంచుల తయారీ, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు ప్రకటించారు. వయసుతో సంబంధం లేకుండా మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. డిసెంబరు నుంచి తరగతులు మొదలుపెట్టారు. ఈ క్రమంలో సుమారు 1000 మంది మహిళలకు పట్టణంలోని నాలుగు ఏరియాల్లో ఉన్న మున్సిపల్ భవనాలలో 45 రోజులు కుట్టులో, నెల రోజులు సంచుల తయారీలో తరగతులు నిర్వహించారు. నిరంతరం ఇక్కడ శిక్షణ కార్యక్రమాలు కొనసాగాలని పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ అధికారులకు మంత్రి సూచనలు చేశారు. దీనికి భిన్నంగా కొంతకాలం నుంచి ఇక్కడ శిక్షణ ఇవ్వడం లేదు. కార్యక్రమాలు కొనసాగించే దిశగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్, మెప్మా అధికారులను మహిళలు కోరుతున్నారు.

మరమ్మతులు చేసినా.. మారని తీరు



పట్టణ నాజరుపేట పాలాద్రి కాలువ రోడ్డులోని భూగర్భంలో పైపు లీకై రహదారిపై తాగునీరు వృథాగా పోతుందని ఫిర్యాదు అందడంతో ఇటీవల అధికారులు మరమ్మతులు చేయించారు. ఇప్పుడు మళ్లీ అదే ప్రాంతంలో పైపు లీకు ఏర్పడిందని, నీరంతా వృథాగా రోడ్డు మీదకు చేరుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సత్వరం మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, తెనాలి(కొత్తపేట)**

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించరూ..!



తెనాలి నుంచి బుర్రిపాలెం వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిలో ట్రాఫిక్ రద్దీ నానాటికీ పెరుగుతోంది. లోడుతో ఉన్న లారీలను రోడ్డుపై నిలపడంతో కళాశాలల, పాఠశాలల బస్సులు, ఇసుక, ఎర్రమట్టి లారీలు, ఆటోలు, ద్విచక్రవాహనాల చోదకులు ఇటుగా రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై లోడు వాహనాలు నిలపకుండా సంబంధిత వ్యాపారులు, అధికారులు చర్యలు తీసుకోవాలని చోదకులు కోరుతున్నారు. **- తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే.**

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: వడ్లమూడి కోటయ్య చౌదరి ఛారిటీస్ ఆధ్వర్యంలో అందించే ఉపకార వేతనాలకు ప్రతిభావంతులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మేనేజింగ్ ట్రస్టీ వడ్లమూడి గోవర్ధనరావు ఆదివారం తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరానికి సెప్టెంబరు 1వ తేదీ నుంచి 15 వరకు దరఖాస్తులు అందించవచ్చని, ఇంటర్‌లో 80 శాతానికి పైగా మార్కులు, ఎంసెట్‌లో 20 వేల లోపు ర్యాంకులు సాధించి మొదటి సంవత్సరం బీటెక్, మెడిసిన్, డిగ్రీ, డిప్లొమా చదువుతున్న విద్యార్థులు అర్హులని వివరించారు. దరఖాస్తులు ట్రస్ట్ వెబ్‌సైట్, ట్రస్ట్ కార్యాలయంలో లభ్యమవుతాయని, పూర్తి చేసి అందించాలని తెలిపారు. వివరాల కోసం 99510 04820, http://vkcharities.in లో సంప్రదించాలని తెలిపారు.

మధుమేహం అదుపులో లేకపోతే మరిన్ని సమస్యలు



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ శారద

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: జీవన శైలిలో మార్పులు, సరైన మందుల వినియోగం, సమయపాలన ద్వారా మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవచ్చునని, అదుపులో లేకుంటే ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని డాక్టర్ శారద తెలిపారు. శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో తెనాలి బుర్రిపాలెం రోడ్డులో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం, ఆరోగ్య అవగాహన కార్యక్రమాల్లో ఆమె పాల్గొని సేవలు అందించారు. పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలకు పరీక్షలు నిర్వహించి వైద్య సలహాలు, నెల రోజులకు సరిపడా మందులను అందించారు. సొసైటీ ప్రతినిధులు, సిబ్బంది పర్యవేక్షించారు.

ఆయుర్వేదంతో సంపూర్ణ ఆరోగ్యం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: వృద్ధాప్యంలో కనిపించే మలబద్ధకం, జ్ఞాపకశక్తి, వినికిడి, చూపు మందగించడం, బలహీనత, నీరసం వంటి అనారోగ్య సమస్యలకు వంటింటి ఔషధాలు, ఆయుర్వేదం ఉత్తమ పరిష్కారాలను అందిస్తాయని ప్రముఖ ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ మహిత పేర్కొన్నారు. సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంఘ భవనంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆమె వృద్ధాప్యము, ఆయుర్వేద వైద్యము, అవగాహన అంశంపై మాట్లాడారు. సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. అధ్యక్ష, కార్యదర్శులు మొవ్వా సత్యనారాయణ, ప్రసాదం పూర్ణచంద్రరావు పర్యవేక్షించగా కోటిరెడ్డి, రత్తయ్య, మల్లేశ్వరరావు పెద్ద సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



సూచనలిస్తున్న ఎస్సై ఎన్‌సి.ప్రసాద్

కొల్లిపర, న్యూస్‌టుడే: నేరాలకు దూరంగా ఉండాలని, మంచి ప్రవర్తనతో జీవనం కొనసాగించాలని రౌడీషీటర్లకు ఎస్సై ఎన్‌సి.ప్రసాద్ తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు నేర నియంత్రణలో భాగంగా మండల పరిధిలోని రౌడీషీటర్లకు కొల్లిపర పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. గతంలో చేసిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోవాలని, మంచి మార్గంలో నడవాలని సూచించారు. కుటుంబ సభ్యుల భవిష్యత్తు, సమాజంలో గౌరవాన్ని దృష్టిలో పెట్టుకుని చెడు స్నేహాలు వీడాలన్నారు. ప్రజల ప్రశాంతతకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రత్యామ్నాయం చూపించాకే ఇళ్లను కూల్చండి

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: 30 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న నిరుపేదల ఇళ్లను కూల్చేస్తే సహించేది లేదని కేవీపీఎస్, సీఐటీయూ నాయకులు హెచ్చరించారు. ఆదివారం నవులూరు గ్రామంలోని ఆర్టీవో కార్యాలయం సమీపంలో దళిత, నిరుపేదలతో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జొన్నకూటి నవీన్‌ప్రకాశ్, సీఐటీయూ రాజధాని కమిటీ అధ్యక్షుడు ఎం.రవి మాట్లాడారు. వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో నివసిస్తున్న నిరుపేద కుటుంబాల వద్ద ప్రభుత్వం జారీచేసిన రేషన్‌కార్డులు, ఓటర్ కార్డులతోపాటు కరెంట్ మీటర్లు ఉన్నాయన్నారు. పేదలకు ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కూల్చేస్తాం అని బెదిరింపులకు పాల్పడటం తగదన్నారు. రాజధాని పనులకు స్థలం అవసరమైతే, ముందుగా ప్రత్యామ్నాయ స్థలం కేటాయించి, ప్రభుత్వమే ఇళ్లు కట్టించి ఇచ్చాకే ఖాళీ చేయించాలన్నారు.

సజావుగా ముగిసిన నీట్ పీజీ పరీక్ష

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఆదివారం నిర్వహించిన నీట్ పీజీ పరీక్ష సజావుగా ముగిసింది. ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 170 మంది అభ్యర్థులకు 169 మంది హాజరయ్యారని సమన్వయకర్త పూర్ణచంద్రశేఖర్ వెల్లడించారు. పెదకాకాని సీఐ నారాయణస్వామి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాన్ని పెదకాకాని తహసీల్దార్ కృష్ణకాంత్ తనిఖీ చేశారు.

ఏడు సవర్ల బంగారం చోరీ

పొన్నూరు, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని షరఫ్‌బజారుకు చెందిన కొల్లిపర్ల వెంకట సుబ్బారావు ఇంట్లో ఆదివారం తెల్లవారుజామున చోరీ జరిగిందని పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ ఘటనలో 7 సవర్ల బంగారం, రూ.15 వేల నగదు, 450 గ్రాముల వెండి అపహరణకు గురైంది. కుటుంబ సభ్యులు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో తలుపు తాళం పగలకొట్టి దొంగలు ఇంట్లోకి ప్రవేశించారని, బీరువాలో ఉన్న బంగారం, నగదు చోరీ చేశారని బాధితుడు అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు అర్బన్ ఎస్సై జగన్‌మోహన్‌రావు సంఘటనా స్థలానికి చేరుకుని దొంగతనం జరిగిన తీరును కుటుంసభ్యులను అడిగి తెలుసుకున్నారు. క్లూస్ టీం సభ్యులు ఆధారాలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు

చేబ్రోలు, న్యూస్‌టుడే: కళాశాలకు వెళ్లిన విద్యార్థి అదృశ్యం కావడంతో చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై వీరనారాయణ కథనం మేరకు నారాకోడూరు గ్రామానికి చెందిన వి.యశ్వంత్ సాయిగోపీనాథ్ బాపట్ల జిల్లా బాపట్లలోని ఓ కళాశాలలో డిప్లొమా విద్యను అభ్యసిస్తున్నాడు. శుక్రవారం కళాశాలకు వెళ్లిన యువకుడు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు రెండు రోజులపాటు గాలించినా ఆచూకీ లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని తెలిపారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం



మొక్క నాటుతున్న రోటరీ గవర్నర్ ఉదయ్‌సుధీర్ పిలానీ, ప్రతినిధులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయని, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యతను మరోసారి గుర్తు చేస్తున్నాయని వక్తలు పేర్కొన్నారు. రోటరీ క్లబ్బుల ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు మనవంతు ప్రయత్నం చేద్దామని రోటరీ 3150 గవర్నర్ ఉదయ్‌సుధీర్ పిలానీ పిలుపు ఇచ్చారు. రోటరీ క్లబ్ ఆఫ్ ఆంధ్రాప్యారిస్ తెనాలి ఆధ్వర్యంలో ఆదివారం సోమసుందరపాలెం రోడ్డు వెంబడి పండ్లు, పూల మొక్కలు నాటారు. వాటి సంరక్షణ బాధ్యత అందరూ తీసుకోవాలన్నారు. రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. 25 మంది రక్తదానం చేశారు. 83 సార్లు రక్తదానం చేసిన క్లబ్ సభ్యుడు నన్నపనేని సునీల్‌కుమార్‌ను సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు కనగాల మధుసూదనప్రసాద్ పర్యవేక్షించగా వెంకటేష్, మహేష్, కృష్ణయ్య, పూర్ణచంద్, రత్నప్రసాద్, నల్లూరి వెంకటేశ్వరరావు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

కొత్త ఓట్లకు 98 దరఖాస్తుల స్వీకరణ

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటు దరఖాస్తుల స్వీకరణకు పోలింగ్ కేంద్రాల వద్ద ఆదివారం ప్రత్యేక శిబిరాలను నిర్వహించారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో 338 పోలింగ్ కేంద్రాల పరిధిలో బీఎల్‌వోలు ఓటర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కొత్త ఓట్లకు 98 దరఖాస్తులు, ఓటు బదిలీ, చిరునామా మార్పులు, చేర్పుల కోసం 78, ఓటు తొలగింపునకు 3 దరఖాస్తులు వచ్చినట్లు ప్రత్తిపాడు తహసీల్దారు కె.వెంకటేశ్వరరావు చెప్పారు.

చెరువుల్లో నీరు నింపండి

పెదనందిపాడు: ప్రత్తిపాడు నియోజకవర్గంలోని కాకుమాను, మల్లాయిపాలెం మేజర్‌కాలువల పరిధిలో 23 చెరువుల్లో నీరు నింపాలని ఏఈ రమేష్‌బాబు తెలిపారు. ఈ కాలువలకు సెప్టెంబర్ 2 నాటికి నీరు వస్తుందని, ఆయా గ్రామాల వారు చెరువుల్లో నింపాలని సూచించారు. రైతులు చెరువులు నిండేందుకు తమ వంతు సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గ్రామదేవతకు బోనాలు

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: ఆత్మకూరు వడ్డెరపాలెం ప్రాంతంలో కొలువైన పోతురాజుస్వామి, అంకాలమ్మ తల్లికి గ్రామస్థులు ఆదివారం బోనాలు సమర్పించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరసారె, పూలు, పండ్లు సమర్పించారు. ప్రతి సంవత్సరం శ్రావణమాసం 3వ ఆదివారం దీన్ని నిర్వహిస్తారు. గ్రామస్థులు ఆరోగ్యంగా ఉండాలని, వర్షాలు సకాలంలో పడి పంటలు బాగా పండాలని పూజలు చేసినట్లు దేవస్థానం కమిటీ ఛైర్మన్ తమ్మిశెటి రమణయ్య తెలిపారు.

వైభవంగా గంగానమ్మ కొలుపులు

దుగ్గిరాల: స్థానిక రజకసంఘం ఆధ్వర్యంలో ఆదివారం కాలనీలో అమ్మవారి రూపాన్ని చిత్రీకరించి కొలుపులు చేశారు. గ్రామంలో ప్రదర్శన నిర్వహించి గంగానమ్మకు, ఇతర గ్రామదేవతలకు నైవేద్యం సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

4న శివాలయం నిర్మాణానికి శంకుస్థాపన

తుళ్లూరు, న్యూస్‌టుడే: అనంతవరంలో మల్లేశ్వరస్వామి దేవస్థానం(శివాలయం) శిథిలావస్థకు చేరడంతో ఈనెల 16న కళాపకర్ష ద్వారా స్వామి, అమ్మవార్ల విగ్రహాలను తొలగించి బాలాలయంలో ప్రతిష్ఠించారు. సెప్టెంబరు 4న వేద పండితులతో నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించనున్నట్లు ఈవో చెన్నుపల్లి శివయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

కృతజ్ఞత సభ ఏర్పాట్ల పరిశీలన

వట్టిచెరుకూరు: వట్టిచెరుకూరులో సెప్టెంబర్ 1న నిర్వహించే కృతజ్ఞత సభ స్థలాన్ని గుంటూరు ఆర్డీవో శ్రీనివాసరావు ఆదివారం పరిశీలించారు. రాష్ట్రమంత్రులు అనగాని సత్యప్రసాద్, కందుల దుర్గేష్, కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ, ఎమ్మెల్యే బూర్లరామాంజనేయులు, కలెక్టర్ సాయికాంత్‌వర్మలు ఈ సభకు హాజరు అవుతుండటంతో ఇక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. మ్రరి సాంబశివరావు, భీమినేని కోటేశ్వరరావు, చిరుమామిళ్ల మల్లికార్జునరావు, శివయ్య, తరుపతిరావులు ఆర్డీవోకు సభ ఏర్పాట్లను వివరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

స్పందనలు: ★ ప్రత్తిపాడులో రెండో వార్డులో కాల్వల్లో పూడిక తీయడం లేదని స్థానికులు మేమున్నాం...మీకు తోడుగా ద్వారా సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన డిప్యూటీ ఎంపీడీవో షేక్.ఆదాం షఫీ పారిశుద్ధ్య కార్మికులతో కాల్వల పూడిక తీయించారు. ★ ప్రత్తిపాడులో జెట్టిమిట్ట బజారులో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు మేమున్నాం...మీకు తోడుగా ద్వారా సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన పంచాయతీ అధికారులు వీధి దీపాలకు మరమ్మతులు చేయించి వెలిగించారు. ★ చినకొండ్రుపాడులో ఎస్సీ ఏరియాకు వెళ్లే పైపులైను లీకై నీరు వృథాగా పోతోందని స్థానికులు మేమున్నాం...మీకు తోడుగా ద్వారా సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన అధికారులు పైపునకు మరమ్మతులు చేయించారు. **- ప్రత్తిపాడు, న్యూస్‌టుడే**

? మోరంపూడి సౌత్‌ఛానల్‌లో తూటాకు బాగా పేరుకుపోయింది. నీటి ప్రవాహానికి ఇబ్బందిగా మారింది. తొలగించాలి. **-రైతు, మోరంపూడి.** ✔ కాల్వను పరిశీలించి చర్య తీసుకుంటాం. **-లక్ష్మీనారాయణ, ఏఈ, దుగ్గిరాల.** –న్యూస్‌టుడే, దుగ్గిరాల

నేడు పెమ్మసాని రాక

పెదనందిపాడు: పెదనందిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నూతన భవన నిర్మాణానికి సోమవారం ఉదయం 10.30 గంటలకు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు శంకుస్థాపన చేస్తారని మండల తెదేపా అధ్యక్షుడు రఘు రామారావు తెలిపారు.

రీసర్వేలో తప్పులు.. రైతులకు తిప్పలు

తాడికొండ, ప్రత్తిపాడు, దుగ్గిరాల, తుళ్లూరు, మేడికొండూరు, న్యూస్‌టుడే

గత వైకాపా ప్రభుత్వం ఆర్భాటంగా భూ-రీసర్వే కార్యక్రమం చేపట్టింది. వందేళ్ల నాటి భూసమస్యలు పరిష్కరిస్తున్నామని అప్పట్లో ఆపార్టీ నేతలు ఊదరగొట్టారు. గత వైకాపా ప్రభుత్వ పాలన చివర్లో పట్టాదారు పాసుపుస్తకాలు అందజేశారు. పుస్తకాలపై అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముఖచిత్రం, నవరత్నాల పేర్లు ముద్రించారు. దీనిపై అప్పట్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. తీరా రీసర్వే ద్వారా పాత సమస్యలు పరిష్కారం కాకపోగా..కొత్తవి పుట్టుకొచ్చాయి.

పొరపాట్లు ఇలా.. వాటిల్లో ముఖ్యంగా పొలం విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు, క్రయవిక్రయాలు, పేర్లు, వారసత్వంలో మార్పులు, ఫొటో, ఆధార్ కార్డు సంఖ్య, సర్వే నంబర్లో తప్పులు దొర్లాయి. దీంతో రైతులు



గగ్గోలు పెట్టారు. సమస్యలు పరిష్కరించాలని అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయింది.

ఇప్పటి పుస్తకాల్లోనూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బాధితుల విజ్ఞప్తి మేరకు ప్రతిష్ఠాత్మకంగా ప్రత్యేక సమగ్ర సవరణ (రీసర్వే) చేపట్టింది. అప్పటి తప్పులు సరి చేసి రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలు అందజేస్తున్నారు. తాడికొండ మండలంలో ఇప్పటికే మోతడక, నిడుముక్కల, రావెల, లచ్చనగుడిపూడి గ్రామాల్లో సర్వే పూర్తి కాగా..పాసుపుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. అయితే ఇక్కడ కూడా అధికారులు, సిబ్బంది అలసత్వం కారణంగా తప్పులు దొర్లాయి.

సిబ్బంది కాలయాపనతో.. ఈ తప్పుల్లో కొన్ని చోట్ల రెవెన్యూ అధికారుల తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోంది. వీటిని సరిదిద్దడానికి కొంత మంది డబ్బులు డిమాండ్ చేస్తూ కాలయాపన చేస్తున్నారు. కొందరు మధ్యవర్తులను పెట్టుకుని వారి ద్వారా వచ్చిన అర్జీలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీనికితోడు అధికారులకు పని భారం కూడా పెరిగింది. ఆయా కారణాలతో సమస్యలు పరిష్కారం కావడం లేదు.

బయటపడుతున్న లోపాలు..

★ తుళ్లూరు మండలంలో హరిశ్చంద్రాపురం, వడ్డమాను గ్రామాల్లో సర్వే పూర్తి కాగా..మొత్తం 1300 హక్కు పత్రాలు పంపిణీ చేశారు. వాటిల్లో 200 పుస్తకాల్లో తప్పులు బయటపడ్డాయి.

★ దుగ్గిరాల మండలంలో 9 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పూర్తయ్యింది. 8,224 పాసు పుస్తకాలు పంపిణీ చేశారు. ఇందులో 1,115 పొరపాట్లు ఉన్నట్లు అధికారులు ముందుగానే గుర్తించి వారే తప్పులు సరి చేసి తిరిగి పంపించారు. పుస్తకాలు ఇంకా అందాల్సి ఉంది.

16 సెంట్లు తగ్గింది..

నిడుముక్కల గ్రామం సర్వే నంబర్ 123, 124లో వారసత్వంగా 3.42 ఎకరాల భూమి వచ్చింది. పూర్వం నుంచి ఈ భూమి మా ఆధీనంలోనే ఉంది. దీనికి సంబంధించిన అన్ని కాగితాలు ఉన్నాయి. ఆన్‌లైన్‌లో కూడా నమోదైంది. గ్రామంలో రీసర్వే జరిగింది. తర్వాత పాసు పుస్తకం ఇచ్చారు. దాంట్లో విస్తీర్ణం మొత్తంగా 16 సెంట్లు తగ్గింది. రీసర్వే సమయంలో అధికారులు మాకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. **- భీమినేని వెంకట రమేష్**

గత యజమానుల పేర్లే కనిపిస్తున్నాయి..

మోతడకలో సర్వే నంబర్ 79-ఏ4లో 1.72 ఎకరాలు 2024 కొనుగోలు చేశాం. అప్పటి నుంచి భూమి మా ఆధీనంలో ఉంది. గ్రామంలో సర్వే జరిగింది. దానికి సంబంధించి అధికారులు నోటీసు ఇచ్చారు. దాంట్లో చూస్తే పొలం అమ్మిన వ్యక్తుల పేర్లు కనిపిస్తున్నాయి. ఈ సమస్యను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా..పరిష్కారం కాలేదు. **-కోటా మాధవి**

మార్కండేయ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ భవనం ప్రారంభం

మంగళగిరి న్యూస్‌టుడే: మార్కండేయ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ నూతన భవనాన్ని సొసైటీ వ్యవస్థాపకులు, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, సామ్రాజ్యం దంపతులు ఆదివారం ప్రారంభించారు. నాంచరమ్మ చెరువు ప్రాంగణంలో సొంతభవనాన్ని సొసైటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. భవిష్యత్తులో పేద చేనేత కుటుంబాల్లోని పిల్లల విద్యకు సహకారాన్ని అందించనున్నట్లు సొసైటీ కార్యదర్శి ప్రగడ రాజశేఖర్ తెలిపారు. పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్ధయ్య, పద్మశాలి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు స్వర్గం పుల్లారావు, సొసైటీ గౌరవాధ్యక్షులు జొన్నాదుల బాబుశివప్రసాద్(బాపూజీ), విశ్రాంత ప్రిన్సిపల్ మంచా విజయమోహనరావు, ఉపాధ్యక్షులు గంజి రవీంద్రనాథ్, పద్మశాలీయ బహుత్తమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుత్తికొండ ధనుంజయరావు, దామర్ల కుబేర స్వామి, మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జొన్నాదుల మణి, అందే రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు స్వయం ఉపాధి కల్పనే లక్ష్యం

తాడేపల్లి, న్యూస్‌టుడే: మహిళలకు ప్రభుత్వం స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తుందని పద్మశాలీ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్ధయ్య అన్నారు. తాడేపల్లి మహానాడులో మహిళా సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన క్లౌడ్ కిచెన్ సెంటర్‌ను ఆదివారం ఆయన పట్టణ తెదేపా అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావుతో కలిసి ప్రారంభించారు. ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రోఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజస్ పథకం ద్వారా దీన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.



క్లౌడ్ కిచెన్ ప్రారంభిస్తున్న అబద్ధయ్య

జాతీయ నృత్య పోటీల్లో ప్రతిభ

తాడేపల్లి, న్యూస్‌టుడే: విశాఖలో నిర్వహించిన జాతీయస్థాయి నృత్య సంగీత ఉత్సవం పోటీల్లో తాడేపల్లికి చెందిన పలగాని ఖ్యాతిశ్రీ, పలగాని రేణుకాశ్రీ, రాయణ కీర్తనలకు ప్రతిష్ఠాత్మక నాట్యకౌముది పురస్కారాలు లభించాయి. పలువురు వారిని అభినందించారు.

పచ్చదనం ప్రకాశించేలా..



పచ్చదనం ప్రకాశించేలా మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు గ్రీన్ గుంటూరులో భాగంగా అధికారులు చేపట్టిన చర్యలు ఆకర్షణీయంగా ఉన్నాయి. వీబీజీ రామ్‌జీ పథకానికి, సీఎస్ఆర్ నిధులు జోడించి చిలువూరు-కాజ దారిలో గ్రీన్ గుంటూరుకు ఏపీ గ్రామీణ బ్యాంక్ సీఎస్ఆర్ నిధులు సమకూర్చింది. ఈ మార్గంలో 3 కి.మీ. నిడివిలో 800 మొక్కలు నాటుతున్నారు. పర్యావరణాన్ని కాపాడేందుకు చేస్తున్న ఈ దీక్షలో సీసీఎల్ కూడా భాగస్వామి అయింది. అన్ని మొక్కలకు ట్రీగార్డులు నిలిపేందుకు 3200 వెదురు కర్రలు అందించింది. రెండేళ్ల వయసున్న సుమారు 6 అడుగుల పొడవున్న పెద్ద మొక్కలను తెచ్చారు. గ్రామీణబ్యాంక్ ట్రీగార్డులనూ సమకూర్చింది. **–న్యూస్‌టుడే, దుగ్గిరాల**

బాగుపడిన పీబీసీ కాలువ



పెదనందిపాడు బ్రాంచి కెనాల్ గత కొన్నేళ్ల నుంచి మరమ్మతులకు నోచక సాగునీరు సక్రమంగా సరఫరా కాక రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో కొప్పర్రు నుంచి గనికపూడి వరకు ఆరు కిలోమీటర్ల పొడవున డీసీ ఛైర్మన్ కల్లూరి కుసుమ ఆధ్వర్యంలో రూ.25 లక్షల ఖర్చుతో పూడిక తీయించారు. కాలువ కట్టలకు ఇరువైపులా ఉన్న కంప, పిచ్చిచెట్లను తొలగించారు. ఇక సాగునీటి సరఫరాకు ఆటంకం ఉండదని ఈ ప్రాంతరైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. **-న్యూస్‌టుడే, పెదనందిపాడు**

పర్చూరు రూటులో ఆటోలే దిక్కు



గుంటూరు డిపో-1 పరిధిలోని గుంటూరు-పర్చూరు రోడ్డులో ఆర్టీసీ బస్సుల కొరత నెలకొంది. దీంతో ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను మండలాల ప్రయాణికులు ఆయా కేంద్రాల్లో నిలువుకాళ్లపై నిలబడి బస్సుల కోసం ఎదురు చూస్తున్నారు. చివరకు ఆటోల్లో ప్రయాణిస్తున్నారు. ఈ మార్గంలో బస్సుల సంఖ్యను పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, ప్రత్తిపాడు**

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

మంగళగిరి టౌన్, న్యూస్‌టుడే : ప్రజల ప్రశాంతతకు, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని రౌడీషీటర్లను మంగళగిరి పట్టణ ఎస్సై శ్రీహరి హెచ్చరించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో సీఐ వీరాస్వామి ఆధ్వర్యంలో స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, చెడు నడత కలిగిన వారికి ఆదివారం ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. గతంలో జరిగిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకుని, చట్టాలను గౌరవిస్తూ, బాధ్యతాయుత పౌరులుగా జీవించాలని సూచించారు. రౌడీ షీటర్లు, నేర ప్రవృత్తి ఉన్న వారిపై నిరంతర నిఘా కొనసాగుతుందన్నారు.

పిరమిడ్ మాస్టర్లకు సత్కారం

మంగళగిరి టౌన్, న్యూస్‌టుడే : ధ్యానంలో శిక్షణ ఇస్తున్న పిరమిడ్ మాస్టర్లు మామిడాల నాగేశ్వరరావు, భాగ్యలక్ష్మి దంపతులను మంగళగిరిలోని రామనాథం చిన్నకోటయ్య - శివపార్వతమ్మ వృద్ధుల సేవాశ్రమంలో సత్కరించారు. ఆశ్రమ అధ్యక్షులు రామనాథం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వారి ధ్యాన ప్రచార సేవలను వక్తలు కొనియాడారు. అనంతరం విశ్వహిందూ పరిషత్ కార్యకర్తల ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు.

ప్రత్యామ్నాయం చూపించాకే ఇళ్లను కూల్చండి

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: 30 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న నిరుపేదల ఇళ్లను కూల్చేస్తే సహించేది లేదని కేవీపీఎస్, సీఐటీయూ నాయకులు హెచ్చరించారు. ఆదివారం నవులూరు గ్రామంలోని ఆర్డీవో కార్యాలయం సమీపంలో దళిత, నిరుపేదలతో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జొన్నకూటి నవీన్‌ప్రకాశ్, సీఐటీయూ రాజధాని కమిటీ అధ్యక్షుడు ఎం.రవి మాట్లాడారు. ఈ ప్రాంతంలో నివసిస్తున్న నిరుపేద కుటుంబాల వద్ద ప్రభుత్వం జారీచేసిన రేషన్‌కార్డులు, ఓటర్‌కార్డులతోపాటు కరెంట్ మీటర్లు ఉన్నాయన్నారు. పేదలకు ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కూల్చేస్తాం అని బెదిరింపులకు పాల్పడటం తగదన్నారు. రాజధాని పనులకు స్థలం అవసరమైతే, ముందుగా ప్రత్యామ్నాయ స్థలం కేటాయించి, ప్రభుత్వమే ఇళ్లు కట్టించి ఇచ్చాకే ఖాళీ చేయించాలన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు నల్లపాడు పోలీసులు ఆదివారం తెలిపారు. సుమారు 60 సంవత్సరాల వయసున్న వ్యక్తి జాతీయ రహదారి సమీపంలోని లింగాయపాలెం పొలాల్లోకి వచ్చి క్రిమిసంహారక మందు తాగాడు. పొలాల్లో మృతదేహం పడి ఉండటాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. నల్లపాడు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని జీజీహెచ్‌కి తరలించారు. మృతుడి నోటి వెంట నురగ వచ్చి ఉండటంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో మృతుడు ఎవరనేది తెలియలేదని, వివరాలు తెలిసిన వారు నల్లపాడు పోలీసులను సంప్రదించాలని సూచించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.




జీజీహెచ్‌లో మృతదేహం

అదృశ్యంపై కేసు నమోదు

తుళ్లూరు, న్యూస్‌టుడే: తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం మహిళ అదృశ్యం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దొండపాడుకు చెందిన భార్గవి(35) తన భర్త తిట్టాడనే కోపంతో శనివారం ఇంటి నుంచి వెళ్లిపోయారు. చుట్టుపక్కల వెతికినా కనిపించక పోవడంతో ఆమె భర్త శివరామకృష్ణ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లోకేశ్ తెలిపారు.

కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు

మంగళగిరి టౌన్, న్యూస్‌టుడే : కరాటే సాధనతో క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యంతో పాటు ఆత్మరక్షణకు ఎంతో ఉపయోపడుతుందని ఎయిమ్స్ పరిపాలన విభాగం వైద్యులు శుభోదీప్ మిత్ర అన్నారు. మంగళగిరి స్వేచ్ఛ బుద్ధవిహార్‌లో జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో క్యూలెవల్ బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు ఆదివారం నిర్వహించారు. టెస్ట్‌లో 9వ క్యూ బెల్ట్‌ను సంవర్ధన్ మిత్ర, సీహెచ్.వాసవిసాయిదుర్గ, రిషిక, మహరీన్, రిద్విన్, పర్ణిక, ఎన్.దుర్గాకల్యాణ్ సాధించగా, 8వ క్యూ బెల్ట్‌ను జిగ్నేష్, వీక్షశ్రీ, యశ్వంత్, 6వ క్యూ బెల్ట్‌ను జ్ఞానేశకార్తీక్ సాధించారు. జపాన్ కరాటే అసోసియేషన్ ఏపీ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్, ఎగ్జామినర్ కొడాలి రవిబాబు, జోనల్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ సాగరిక పాల్గొన్నారు.



విద్యార్థులతో డాక్టర్ శుభోదీప్ మిత్ర

బాడీ బిల్డింగ్ పోటీల్లో పతకాలు

మంగళగిరి టౌన్, న్యూస్‌టుడే : గుడివాడలో ఈనెల 29న జరిగిన ఎన్టీఆర్ కప్ రాష్ట్ర స్థాయి బాడీబిల్డింగ్ పోటీల్లో మంగళగిరికి చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. 50 కిలోల బాడీ బిల్డింగ్ విభాగంలో ఎన్.మనోజ్ స్వర్ణపతకం, మెన్స్ ఫిజిక్ 165 సెంటీమీటర్ల లోపు విభాగంలో వెండి పతకం కైవసం చేసుకున్నారు. 70 కిలోల విభాగంలో జె.శివదుర్గాప్రసాద్ కాంస్యం సాధించారు. కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో విజేతలను కోచ్ ఎం.ఎం.హుస్సేన్ అభినందించారు.



క్రీడాకారుడు మనోజ్‌ను అభినందిస్తున్న కోచ్ హుస్సేన్

మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం

ఫిరంగిపురం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ ఫిరంగిపురం మండల అధ్యక్షుడిగా వెరిచర్ల జయరావును నియమించినట్లు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు యన్నం సుధీర్‌బాబు తెలిపారు. ఈమేరకు జయరావుకు నియామకపత్రం అందజేశారు.

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా గుజ్జర్లపూడి జాన్‌బాబును నియమిస్తూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఇటీవల ఉత్తర్వులు ఇచ్చారు. ఆయనకు నియామకపత్రం అందజేశారు.

ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని ఎమ్మెల్సీకి వినతి

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఒప్పంద అధ్యాపకులు వినతిపత్రం అందించారు. గుంటూరులోని ఎమ్మెల్సీ కార్యాలయంలో ఒప్పంద అధ్యాపకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. విశ్వవిద్యాలయంలో 15 ఏళ్లకు పైగా పనిచేస్తున్నా సమాన పనికి సమాన వేతనం దక్కడం లేదని ఆయనకు తెలిపారు. వారి సమస్యలను విన్న ఆయన విద్యాశాఖాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం వీసీ ఆచార్య గంగాధర్‌తో ఆయన మాట్లాడారు.

నేడు ఎన్ఆర్ఐఐటీలో ప్రారంభ్-2026

మేడికొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని ఎన్ఆర్ఐఐటీ కళాశాలలో ఈనెల 31న ప్రారంభ్-2026 జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ సంజయ్ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి ఏడాది విద్యార్థులకు క్లాసులు మొదలు కానున్న నేపథ్యంలో దీన్ని ఏర్పాటు చేశామన్నారు.

గుంటూరు తూర్పు

జిల్లా స్థాయి కూడో పోటీల్లో సత్తా

గుంటూరు క్రీడలు : గుంటూరు జిల్లా కూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడో కూడో జిల్లాస్థాయి టోర్నమెంట్ పోటీలు ఆదివారం బీఆర్ స్టేడియంలో నిర్వహించినట్లు జిల్లా కార్యదర్శి ఆర్. సిద్ధార్థ వర్మ తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులు విశాఖపట్నంలో సెప్టెంబరు 18, 19, 20 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి కూడో టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ కోచ్‌లు కరాటే బ్లాక్‌బెల్ట్ 7 డాన్ డి.ప్రభాకర్, చెన్నా పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న హరికథా గానం



జయంతి సావిత్రి భాగవతారిణి

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కల్యాణ వేదికపై ఆదిభట్ల నారాయణదాస కథాగాన కళాపరిషత్ ఆధ్వర్యంలో నారాయణ దాసు 162వ జయంతి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. జయంతి సావిత్రి భాగవతారిణి ఆదిభట్ల నారాయణదాసు చరిత్ర హరికథా గానం చేశారు. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాజ్యలక్ష్మి తదితరులు పర్యవేక్షించారు.

ప్రశాంతంగా నీట్ పీజీ



బందోబస్తు పరిశీలిస్తున్న డీఎస్పీ పూర్ణచంద్రరావు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లాలో ఆదివారం నిర్వహించిన నీట్ పీజీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో ఉదయం నుంచి అన్ని పరీక్షాకేంద్రాల వద్ద పటిష్ఠ పోలీసు బందోబస్తు నిర్వహించారు. బందోబస్తు తీరును డీఎస్పీ పూర్ణచంద్రరావు పరిశీలించారు. పరీక్షాకేంద్రాల పరిసర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిరంతరం నిఘా పెట్టారు.

వీణ తీగలపై విజయ రాగాలు..

గుంటూరు సాంస్కృతికం, పట్నంబజారు, న్యూస్‌టుడే

కచేరీలతో మహిళల స్ఫూర్తిబాట



భారతీయ శాస్త్రీయ సంగీత సంప్రదాయాన్ని, అరుదైన వీణా వాదనాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటూ, నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు పలువురు స్త్రీమూర్తులు. వృత్తి ఏదైనా, వయసుతో నిమిత్తం లేకుండా.. సంగీతమే శ్వాసగా సాగుతున్నారు. కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూ.. తమకు నచ్చిన రంగంలో రాణిస్తున్నారు.

విద్వాంసులను ప్రోత్సహిస్తూ..

విద్వాంసులను ప్రోత్సహిస్తూ: బ్రాడీపేటకు చెందిన **రామరాజు లక్ష్మీ శ్రీనివాస్..** బీకాం పూర్తి చేశారు. ఆకాశవాణి 'బి' గ్రేడ్ ఆర్టిస్టుగా రాణిస్తున్నారు. నిర్విరామంగా నాలుగు గంటల పాటు వీణ కచేరి చేసి బంగారు కంకణ సత్కారం అందుకున్నారు. ఏటా ప్రముఖ విద్వాంసులను రామరాజు ఫౌండేషన్ ద్వారా సత్కరిస్తూ వీణ విద్వాంసులను ప్రోత్సహిస్తున్నారు.

చిన్నప్పటి నుంచే ఆసక్తి: చిన్నప్పుడు ఓ దేవాలయంలో వీణ కచేరి చూసి.. ఆకర్షితురాలయ్యారు. వీణ నేర్చుకునేందుకు తండ్రి ప్రోత్సహించారు. పెళ్లయ్యాక కుటుంబ బాధ్యతలు స్వీకరించారు. వీణ సాధనకు వీలుపడలేదు. కొన్నాళ్ల తర్వాత భర్త రామరాజు శ్రీనివాసరావు ప్రోత్సాహంతో మళ్లీ వీణా వాదనం ఆరంభించారు.

శ్రోతలను మంత్రముగ్ధులను చేస్తూ..



తెలుగు నేలపై వీణా సంప్రదాయాన్ని పరిరక్షిస్తూ, తన సాధనతో శ్రోతలను మంత్రముగ్ధులను చేస్తున్నారు బ్రాడీపేటకు చెందిన **కె.నాగలక్ష్మి.** సంగీత సాధనను ప్రథమ కర్తవ్యంగా భావిస్తూ.. మరోవైపు ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా సమాజానికి సేవలందిస్తున్నారు. సంగీతంలో పట్టు సాధించాలనే సంకల్పంతో ఎంఏ పూర్తి చేశారు. ఎంఏ ఎకనామిక్స్ చదివారు. భిన్న రంగాలే అయినా.. ఆమె ఆలోచన విధానాన్ని, జీవితాన్ని క్రమశిక్షణతో కూడిన మార్గంలో నడిపించాయి.

★ **సాంస్కృతిక వేదికలపై :** తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రాలు, సాంస్కృతిక వేదికలపై అనేక ప్రదర్శనలు చేస్తున్నారు. ప్రతిష్ఠాత్మక ధర్మపథం, తితిదే ఆధ్వర్యంలో నిర్వహించే నాదనీరాజనం వంటి వేదికలపై ప్రదర్శనలిచ్చారు. త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా నిర్వహించే పంచరత్న కృతి సేవలో త్యాగయ్య కృతులను వీణపై వినిపించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

94406 38515, 80085 73097

స్పందన: యాదవబజారు మూడోలైన్ డ్రెయిన్లలో పూడికలు, చెత్త పేరుకుపోయి మురుగునీరు పారుదలకు ఆటంకం ఏర్పడిందని స్థానికుడు వినయ్‌కుమార్ ఫిర్యాదు చేశారు. సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్‌కు తెలపగా పూడికలు తీయించారు.

✪ ఆదిత్యనగర్ ప్రధానరోడ్డులో చెత్తకుప్పలు కొన్ని రోజులుగా అలాగే ఉండడంతో వీధి అపరిశుభ్రంగా ఉందని స్థానికుడు మోహన్‌రావు తెలిపారు. సమస్య ప్రజారోగ్య అధికారుల దృష్టికి తీసుకెళ్లగా చెత్తకుప్పల్ని డంపింగ్‌యార్డుకు తరలించారు.

-న్యూస్‌టుడే, నగరపాలకసంస్థ (గుంటూరు)

జానీ బాషాకు పురస్కారం

పట్నంబజారు, న్యూస్‌టుడే: ప్రముఖ నటి జమున జయంతిని పురస్కరించుకుని వంశీ ఇంటర్నేషనల్ సంస్థ ఆదివారం హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో కళాభారతి మహానంది పురస్కారాల ప్రదానం చేసింది. గుంటూరు వాణిజ్య పన్నులశాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సయ్యద్ జానీ బాషాకు ఈ అవార్డును దర్శకుడు రేలంగి నరసింహారావు అందజేశారు. జానీ బాషా అనేక కవితలు రచించి పలు సాహితీ, సాంస్కృతిక సంస్థల నుంచి అవార్డులు పొందారు.



ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన.. 59 మందిపై కేసులు

పట్నంబజారు, న్యూస్‌టుడే: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపిన వారిపై ట్రాఫిక్ పోలీసులు ఆదివారం కేసులు నమోదు చేశారు. పాతబస్టాండు సెంటర్, ఎత్తురోడ్డు సెంటర్, హిమనిసెంటర్లలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. అతివేగంగా వాహనాలు నడపడం, రాంగ్ పార్కింగ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం, ఒకే వాహనంపై ముగ్గురు ప్రయాణించడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేయడం.. ఇలా మొత్తం 59 మందిపై కేసులు నమోదు చేశారు. అపరాధరుసుంగా రూ.15,810 వసూలు చేసినట్లు ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు.

శుద్ధ జలం అందించడమే లక్ష్యం



తక్కెళ్లపాడు రిజర్వాయర్‌లో నీటి నాణ్యతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నసీర్

ఎన్టీఆర్ సర్కిల్,న్యూస్‌టుడే: నగర ప్రజలకు శుద్ధ జలాన్ని అందించడమే లక్ష్యమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ స్పష్టం చేశారు. తక్కెళ్లపాడు, నెహ్రూనగర్ రిజర్వాయర్లతో పాటు ఈఎల్ఎస్ పాయింట్లను ఆయన ఆదివారం పరిశీలించారు. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో రంగుమారిన నీరు సరఫరా అవుతోందని ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో శుద్ధీకరణ వ్యవస్థలు, తాగునీటి సరఫరా గురించి అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తక్కెళ్లపాడు రిజర్వాయర్‌కు కృష్ణా నది నుంచి రా వాటర్ సరఫరా అవుతోందని, పట్టిసీమ నుంచి రావడం వల్ల నీరు రంగు మారిందని వివరించారు. ప్రతి రిజర్వాయర్ వద్ద క్లోరినేషన్ చేసి ఇళ్లకు సరఫరా చేయడం వరకు అంచలంచెలుగా పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎక్కడైనా రంగుమారిన నీటి సరఫరా అవుతుంటే 103కు తెలియజేయాలని సూచించారు. మున్సిపల్ సిబ్బంది చర్యలు తీసుకుంటారని తెలిపారు.

అధికారులను ఆదేశించి..

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: మోతీలాల్‌నగర్, నెహ్రూనగర్‌లో తాగునీటి సమస్య గురించి రిజర్వాయర్ పరిశీలనకు వచ్చిన ఎమ్మెల్యే నసీర్‌కు మాజీ కార్పొరేటర్ అయిశెట్టి కనకదుర్గ శ్రీనివాస్, కూటమి నాయకులు వివరించారు. ఎమ్మెల్యే అక్కడ ఉన్న జీఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడారు. తాగునీటి పైపు లీకులను సరిచేశామని, శుద్ధి చేసిన నీరు సరఫరా చేస్తున్నామని అధికారులు తెలిపారు. ప్రజలకు అందించే తాగునీరు విషయంలో చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. సచివాలయ కార్యదర్శులు ఇళ్లకు సరఫరా చేస్తున్న నీటిని పరిశీలించాలని సూచించారు. రాష్ట్ర తెలుగు మహిళ గుడిపల్లి వాణి, కూటమి నాయకులు ఉన్నారు.

ట్రాక్టర్ బీభత్సం.. తప్పిన ప్రమాదం



నుజ్జయిన కారు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: నగరంలో ఓ ట్రాక్టర్ బీభత్సం సృష్టించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి కళామందిర్ కూడలి నుంచి బృందావన్‌గార్డెన్స్‌కు వెళ్లే మార్గంలో వేగంగా వచ్చిన ఓ ట్రాక్టర్ కారును ఢీకొంది. ఆ కారు ముందున్న మరో కారుకు తగిలింది. ఈ ఘటనలో మొదటి కారు వెనుక భాగం నుజ్జయ్యింది. కారులో ఉన్నవాళ్లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఇతర వాహనదారులకు త్రుటిలో ప్రమాదం తప్పినట్లైంది. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. ట్రాక్టర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని అతడికి శ్వాస పరీక్షలు చేయగా మద్యం మత్తులో ఉన్నట్లు తేలింది. కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను జప్తు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ సింగయ్య తెలిపారు.



అధ్వానంగా మరుగుదొడ్లు

పాతబస్టాండు సెంటర్‌లోని మరుగుదొడ్ల అభివృద్ధిపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. నగర నడిబొడ్డున ఉన్న వాటిలో కొన్ని నెలల నుంచి నీటి సౌకర్యం లేదు. ఈ ప్రాంతంలో వ్యాపార సంస్థలు, వస్త్ర దుకాణాలు, ఆసుపత్రులు, థియేటర్లులాంటి ఎక్కువగా ఉండడంతో జిల్లా నలుమూలల నుంచి రోజూ ప్రజలు పెద్దసంఖ్యలో వస్తుంటారు. ఇక్కడ మరుగుదొడ్లను వినియోగిస్తుంటారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో కొందరు దాదాపు రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న బస్టాండులోని మరుగుదొడ్లను ఆశ్రయిస్తున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

-న్యూస్‌టుడే, పట్నంబజారు

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: రౌడీషీటర్లు నేరాలకు దూరంగా ఉండాలని పోలీసు అధికారులు స్పష్టం చేశారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో ఆదివారం జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్‌ల్లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు, నేరప్రవృత్తి కలిగిన వ్యక్తుల కదలికలపై జిల్లా వ్యాప్తంగా నిరంతర నిఘా ఉంటుందని పోలీసు అధికారులు తెలిపారు. రౌడీయిజం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే ఉపేక్షించమన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు



శ్వాస పరీక్ష చేస్తున్న ట్రాఫిక్ పోలీసు

పట్నంబజారు, న్యూస్‌టుడే: బస్టాండు సెంటర్‌లో ఆదివారం డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపిన నలుగురు చోదకులపై కేసులు నమోదు చేసి, వాహనాల్ని స్వాధీనం చేసుకున్నట్లు తూర్పు విభాగపు ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు ఆయన హెచ్చరించారు.

చెత్తకుప్పలు.. ప్రజల ఇబ్బందులు



ఆర్టీసీకాలనీలో రహదారిపై చెత్తకుప్పలు పేరుకుపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల ముందు పిచ్చిమొక్కలు, చెత్త కుప్పగా వేయడం వల్ల దోమల బెడద ఎక్కువగా ఉందని వాపోతున్నారు. దుర్వాసన భరించలేకపోతున్నామని, వెంటనే శుభ్రం చేయాలని కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, గుంటూరు నేరవార్తలు

ధర వరలు



ఎన్టీఆర్ రైతుబజారులో ధరలు నిన్న టివి.. (కిలో రూపాయల్లో) టమాటా 24, వంగ 25, బెండ 15, పచ్చిమిర్చి 33, కాకర 35, బీర 32, క్యారెట్ 56, క్యాబేజీ 27, దొండ 24, బంగాళదుంప 23, ఉల్లి 46, గోరుచిక్కుళ్లు 28, దోస 15, పొట్ల 12, చామ 34, గోంగూర 8, తోటకూర 10, చుక్కకూర 10, మెంతికూర 5, కొత్తిమీర 25, బీట్‌రూట్ 42, కీర 54, క్యాప్సికం 55, అల్లం 175, ఫ్రెంచి బీన్స్ 104, సొర 10, అరటి 8.

-న్యూస్‌టుడే, పట్నంబజారు

తాగునీరు రోడ్డుపాలు



సీతానగర్ ఒకటో వీధిలో తాగునీటి పైపు లీకు కావడంతో నీరు రోడ్డుపై వృథాగా పోతోంది. రోజుల తరబడి ఇలా జరగడంతో రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. అటుగా వెళుతున్న వాహనాల వల్ల నీరు తమపై పడుతుందని పాదచారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నీరు రోడ్డువైపు రాకుండా పక్కనే ఉన్న కాలువలోకి వెళ్లేలా స్థానికులు రాళ్లను ఏర్పాటు చేశారు. పైపులకు మరమ్మతులు చేసి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, నెహ్రూనగర్

మన్‌కీ బాత్‌తో విద్యార్థులకు ఉపయోగం



కార్యక్రమాన్ని వీక్షిస్తూ...

పట్నంబజారు, న్యూస్‌టుడే: మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించడం ద్వారా విద్యార్థులు పలు వైజ్ఞానిక అంశాలు తెలుసుకుంటారని జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు డా. దార అంబేడ్కర్ పేర్కొన్నారు. మన్‌కీ బాత్ 137వ ఎపిసోడ్‌ను ఆదివారం అడవి తక్కెళ్లపాడులోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో భాజపా నాయకులు 400 మంది విద్యార్థులతో కలిసి చూశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ హనుమంతరావు, అధ్యాపకురాలు పద్మ, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంతేటి బ్రహ్మయ్య, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి గట్టుపల్లి అబ్రహం, జిల్లా కార్యదర్శి నులక యేసు రత్నం తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ పట్ల అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ హనీష పోలవరపు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: క్యాన్సర్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ హనీష పోలవరపు పేర్కొన్నారు. అరండల్‌పేటలో అవగాహన సంస్థ ఆధ్వర్యంలో ఆరోగ్య సభను ఆదివారం నిర్వహించారు. డాక్టర్ హనీష మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి ప్రమాదకరమైనప్పటికీ ఇప్పుడు ఆధునిక చికిత్సలు అందుబాటులోకి వచ్చాయన్నారు. స్త్రీలకు వచ్చే బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్‌ల గురించి మాట్లాడుతూ 50 ఏళ్లపైబడిన మహిళలు ప్రతి ఏటా మామోగ్రామ్ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. పురుషుల్లో వచ్చే ప్రోస్టేట్ క్యాన్సర్‌ను గుర్తించేందుకు పీఎస్ఏ పరీక్ష అల్ట్రా సౌండ్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో అవగాహన సంస్థ ఆరోగ్య సభ సమన్వయకర్త టీవీ సాయిరాం, ఆర్ఎంపీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజా సిద్ధార్థ, విశ్రాంత ప్రిన్సిపల్ ముప్పాళ్ళ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ముహమ్మద్ ప్రవక్త ఆదర్శనీయులు



పుస్తకాన్ని ఆవిష్కరించిన మురసం నాయకులు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: ముహమ్మద్ ప్రవక్త పాత్ర విశిష్టమైందని సమకాలీన పరిస్థితుల్లో యావత్ ముస్లిం సమాజం ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ముస్లిం రచయితల సంఘం (మురసం) జాతీయ నాయకుడు కరిముల్లా అన్నారు. ఆవాజ్ కమిటీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో ఆదివారం బ్రాడీపేటలోని కార్యాలయంలో.. ప్రవక్త ముహమ్మద్ జన్మదినాన్ని పురస్కరించుకుని కవితా సమ్మేళనం నిర్వహించారు. ప్రవక్త జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ముహమ్మద్ ప్రవక్త జీవితం- సామాజిక కోణం అనే అంశంపై అతిథిగా హాజరైన కరిముల్లా మాట్లాడారు. ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి చిష్టి, ప్రజానాట్యమండలి జాతీయ నాయకులు గని, ఆవాజ్ నాయకులు బాషా, సైదా, తెలుగు రచయితల సంఘం నాయకులు సుబాని తదిరతులు పాల్గొన్నారు.

ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నేడు

నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: స్థానిక సమస్యలు, అర్జీలు వేగంగా పరిష్కరించేందుకు వీలుగా సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ మయూర్ అశోక్ ఓ ప్రకటనలో తెలిపారు. జీఎంసీ కౌన్సిల్ హాల్‌లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విభాగాల అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు, ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

గుంటూరు పశ్చిమ

తాడేపల్లిలో సంస్కృత సప్తాహ వేడుకలు

జిల్లా పరిషత్తు(గుంటూరు) : జిల్లాలోని తాడేపల్లి శ్రీపార్ప్యాన్ గ్రాండ్‌లో జరుగుతున్న సంస్కృత సప్తాహ ముగింపు వేడుకలు సోమవారం జరగనున్నాయని తెలుగు, సంస్కృత అకాడమీ కార్యదర్శి పి. రంజిత్ బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అకాడమీ అధ్యక్షుడు ఆర్.డి.విల్సన్ అధ్యక్షతన జరిగే వేడుకలకు ముఖ్య అతిథిగా లాల్‌బహదూర్ శాస్త్రి రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం కులపతి ఆచార్య మురళీమనోహర్ పాఠక్ హాజరవుతారన్నారు. పురస్కార గ్రహీతలను అతిథులు సన్మానిస్తారన్నారు.

అలరించిన ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు


చిన్నారుల నృత్య ప్రదర్శన

గుంటూరు సాంస్కృతికం: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం పద్మావతి కళావేదికపై సంస్కార భారతి ఆధ్వర్యంలో కృష్ణాష్టమి సందర్భంగా ముందస్తు బాల గోకులం వేడుకలు నిర్వహించారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో చిత్రలేఖనం భక్తిగీతాలు, నృత్య, భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు ఇండ్ల శ్రీధర బాబు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

80086 22566, 97042 53525, 80085 74897

స్పందన: బ్రాడీపేట ప్రధాన వీధుల్లో చెత్త పేరుకుపోయింది. ఈ సమస్యను 'న్యూస్‌టుడే' శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏడుకొండలు దృష్టికి తీసుకువెళ్లగా.. పారిశుద్ధ్య సిబ్బందిని పంపారు. వీధుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. ☛ అరండల్‌పేట ప్రధాన వీధుల్లోని మురుగు కాల్వల్లో మురుగు పేరుకుపోయింది. పారుదలకు ఆటంకం ఏర్పడడంతో సమస్యను శానిటరీ ఇన్‌స్పెక్టర్ మనోహర్ దృష్టికి తీసుకువెళ్లాం. ఆయన స్పందించి.. కార్మికుల ద్వారా కాల్వల్లో పేరుకుపోయిన మురుగు తొలగింపజేశారు. ☛ మస్తాన్ దర్గా ప్రధాన వీధుల్లోని మురుగు కాల్వలు పూడిపోయాయి. ఈ విషయాన్ని శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లుకు తెలియజేయగా.. పారిశుద్ధ్య సిబ్బందితో పూడిక తీయించారు. ☛ కన్నావారితోట ప్రధాన వీధుల్లోని మురుగు కాల్వల్లో మురుగు పేరుకుపోయింది. పారుదలకు ఆటంకం ఏర్పడింది. ఈ విషయాన్ని 'న్యూస్‌టుడే' శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకువెళ్లగా.. పారిశుద్ధ్య సిబ్బందిని పంపి పూడిక తొలగింపజేశారు. ☛ నల్లచెరువు ప్రధాన వీధుల్లో వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. సమస్యను 'మేమున్నాం మీకుతోడుగా' ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్ చందు దృష్టికి తీసుకువెళ్లాం. పారిశుద్ధ్య సిబ్బందిని పంపి వీధుల్లో వ్యర్థాలను తొలగింపజేశారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. - **న్యూస్‌టుడే, నగరంపాలెం**

వీణ తీగలపై విజయ రాగాలు.. మహిళల స్ఫూర్తిబాట

భారతీయ శాస్త్రీయ సంగీత సంప్రదాయాన్ని, అరుదైన వీణా వాదనాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటూ, నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు పలువురు స్త్రీమూర్తులు. వృత్తి ఏదైనా, వయసుతో నిమిత్తం లేకుండా.. సంగీతమే శ్వాసగా సాగుతున్నారు. కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూ.. తమకు నచ్చిన రంగంలో రాణిస్తున్నారు.
- **న్యూస్‌టుడే, గుంటూరు సాంస్కృతికం, పట్నంబజారు**

విద్వాంసులను ప్రోత్సహిస్తూ..

నగరంలోని బ్రాడీపేటకు చెందిన **రామరాజు లక్ష్మీ శ్రీనివాస్..** బి.కాం డిగ్రీ పూర్తి చేశారు. ఆకాశవాణి 'బి' గ్రేడ్ ఆర్టిస్టుగా రాణిస్తున్నారు. నిర్విరామంగా నాలుగు గంటల పాటు వీణ కచేరి చేసి బంగారు కంకణ సత్కారం అందుకున్నారు. అవార్డులు, సత్కారాలు అందుకోవడమే కాకుండా ఏటా ప్రముఖ విద్వాంసులను రామరాజు ఫౌండేషన్ ద్వారా ఘనంగా సత్కరిస్తూ వీణ విద్వాంసులను ప్రోత్సహిస్తున్నారు.



చిన్నప్పటి నుంచే ఆసక్తి..

చిన్నప్పుడు గుంటూరులోని ఒక దేవాలయంలో వీణ కచేరి చూసి.. ఆకర్షితురాలయ్యారు. వీణ నేర్చుకుంటానని తండ్రికి చెప్పగా... ప్రోత్సహించారు. ఇలా సాగుతుండగానే.. మధ్యలో పెళ్లి అయ్యింది. కుటుంబ బాధ్యతలు స్వీకరించారు. ఈ క్రమంలో కొంత కాలం వీణ సాధనకు వీలుపడలేదు. కుమారుడు మంచి ఉద్యోగంలో స్థిరపడ్డారు. ఛార్టెడ్ అకౌంటెంట్‌గా ఉన్న భర్త రామరాజు శ్రీనివాసరావు ప్రోత్సాహంతో మళ్లీ వీణావాదనం ఆరంభించారు. కచేరీలు చేసి అందరి ప్రశంసలు పొందుతున్నారు. రామరాజు ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి.. వీణా విద్వాంసులను గౌరవిస్తున్నారు. ఏటా పది మంది వీణ విద్వాంసులతో కచేరీలు నిర్వహించి.. ఈమని శంకర శాస్త్రి పేరుతో ఒకరికి పురస్కారం అందిస్తున్నారు.

శ్రోతలను మంత్రముగ్ధుల్ని చేస్తూ..

తెలుగు నేలపై వీణా సంప్రదాయాన్ని పరిరక్షిస్తూ, తన సాధనతో శ్రోతలను మంత్రముగ్ధులను చేస్తున్నారు బ్రాడీపేటకు చెందిన విశిష్ట కళాకారిణి **కె. నాగలక్ష్మి.** సంగీత సాధనను జీవిత ప్రథమ కర్తవ్యంగా భావిస్తూ.. మరోవైపు ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా సమాజానికి సేవలందిస్తున్నారు. సంగీతంలో పట్టు సాధించాలనే సంకల్పంతో ఎం.ఎ. పూర్తి చేశారు. అలాగే ఎం.ఎ. ఎకనామిక్స్ చదివారు. ఈ రెండూ భిన్న రంగాలే అయినా.. ఆమె ఆలోచన విధానాన్ని, జీవితాన్ని క్రమశిక్షణతో కూడిన మార్గంలో నడిపించాయి.



సాంస్కృతిక వేదికలపై కచేరీలు

నాగలక్ష్మి తన వీణా గానంతో తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రాలు, సాంస్కృతిక వేదికలపై అనేక ప్రదర్శనలు చేస్తున్నారు. భక్తి ప్రవత్తులతో కూడిన ప్రతిష్ఠాత్మక ధర్మపథం, తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే ప్రసిద్ధ నాదనీరాజనం వంటి వేదికలపై చేసిన ప్రదర్శనలు.. కళాభిమానులను ఆకట్టుకున్నాయి. త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా నిర్వహించే పంచరత్న కృతి సేవలో పాల్గొని త్యాగయ్య కృతులను వీణపై వినిపించారు. తిరుపతి, అరుణాచలం, విజయవాడ, తెనాలి, కాకినాడ వంటి సాంస్కృతిక నగరాల్లో కచేరీలు చేస్తున్నారు. వృత్తి.. ప్రవృత్తిని సమన్వయం చేసుకుంటూ.. సంప్రదాయ సంగీత కళకు వన్నె తెస్తున్నారు.



జిల్లా స్థాయి కూడో పోటీల్లో ప్రతిభ


విజేతలను ప్రకటిస్తూ..

గుంటూరు క్రీడలు: గుంటూరు జిల్లా కూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడో కూడో జిల్లాస్థాయి టోర్నమెంట్ పోటీలు ఆదివారం బీఆర్ స్టేడియంలో నిర్వహించినట్లు జిల్లా కార్యదర్శి ఆర్. సిద్ధార్థ వర్మ తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులు విశాఖపట్నంలో సెప్టెంబరు 18, 19, 20 తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ కోచ్‌లు కరాటే బ్లాక్‌బెల్ట్ 7 డాన్ డి.ప్రభాకర్, చెన్నా పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నేడు

నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: స్థానిక సమస్యలు, అర్జీలు వేగంగా పరిష్కరించేందుకు వీలుగా సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ మయూర్ అశోక్ ఓ ప్రకటనలో తెలిపారు. జీఎంసీ కౌన్సిల్ హాల్‌లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విభాగాల అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు, ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన.. 59 మందిపై కేసులు

పట్నంబజారు, న్యూస్‌టుడే: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపిన వారిపై ట్రాఫిక్ పోలీసులు ఆదివారం కేసులు నమోదు చేశారు. పాతబస్టాండు సెంటర్, ఎత్తురోడ్డు సెంటర్, హిమనిసెంటర్లలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. అతివేగంగా వాహనాలు నడపడం, రాంగ్ పార్కింగ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం, ఒకే వాహనంపై ముగ్గురు ప్రయాణించడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేయడం.. ఇలా మొత్తం 59 మందిపై కేసులు నమోదు చేశారు. అపరాధరుసుంగా రూ.15,810 వసూలు చేసినట్లు ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు.

ఆకట్టుకున్న హరికథా గానం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కల్యాణ వేదికపై ఆదిభట్ల నారాయణదాస కథాగాన కళాపరిషత్ ఆధ్వర్యంలో నారాయణ దాసు 162వ జయంతి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. జయంతి సావిత్రి భాగవతారిణి ఆదిభట్ల నారాయణదాసు చరిత్ర హరికథా గానం చేశారు. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాజ్యలక్ష్మి తదితరులు పర్యవేక్షించారు.


ఆలపిస్తున్న జయంతి సావిత్రి భాగవతారిణి

సందడిగా సైక్లింగ్



ఎస్.వి.ఎన్.కాలనీ, న్యూస్‌టుడే : రాజేంద్రనగర్‌లో నెక్స్ట్ జెన్ స్కూల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 10కే సైక్లోథాన్ కార్యక్రమం సందడిగా సాగింది. ఆరోగ్యం.. ఆనందం కోసం సైకిల్ తొక్కండి నినాదంతో చేపట్టిన కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

జానీ బాషాకు పురస్కారం



పట్నంబజారు, న్యూస్‌టుడే: ప్రముఖ నటి జమున జయంతిని పురస్కరించుకుని వంశీ ఇంటర్నేషనల్ సంస్థ ఆదివారం హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో కళాభారతి మహానంది పురస్కారాల ప్రదానం చేసింది. గుంటూరు వాణిజ్య పన్నులశాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సయ్యద్ జానీ బాషాకు ఈ అవార్డును దర్శకుడు రేలంగి నరసింహారావు అందజేశారు. జానీ బాషా అనేక కవితలు రచించి పలు సాహితి, సాంస్కృతిక సంస్థల నుంచి అవార్డులు పొందారు.

క్యాన్సర్ పట్ల అప్రమత్తత అవసరం

నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే : క్యాన్సర్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ హనీష పోలవరపు పేర్కొన్నారు. అరండల్‌పేటలో అవగాహన సంస్థ ఆధ్వర్యంలో ఆరోగ్య సభను ఆదివారం నిర్వహించారు. డాక్టర్ హనీష మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి ప్రమాదకరమైనప్పటికీ ఇప్పుడు ఆధునిక చికిత్సలు అందుబాటులోకి వచ్చాయన్నారు. స్త్రీలకు వచ్చే బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్ల గురించి మాట్లాడుతూ 50 ఏళ్లుపైబడిన మహిళలు ప్రతి ఏటా మామోగ్రామ్ పరీక్ష చేయించుకోవాలని సూచించారు.





ముహమ్మద్ ప్రవక్త ఆదర్శనీయులు


పుస్తకాన్ని ఆవిష్కరించిన మురసం నాయకులు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: ముహమ్మద్ ప్రవక్త పాత్ర విశిష్టమైందని సమకాలీన పరిస్థితుల్లో యావత్ ముస్లిం సమాజం ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ముస్లిం రచయితల సంఘం (మురసం) జాతీయ నాయకుడు కరిముల్లా అన్నారు. ఆవాజ్ కమిటీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో ఆదివారం బ్రాడీపేటలోని కార్యాలయంలో.. ప్రవక్త ముహమ్మద్ జన్మదినాన్ని పురస్కరించుకుని కవితా సమ్మేళనం నిర్వహించారు. ప్రవక్త జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ముహమ్మద్ ప్రవక్త జీవితం-సామాజిక కోణం అనే అంశంపై అతిథిగా హాజరైన కరిముల్లా మాట్లాడారు. ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి చిష్టి, ప్రజానాట్యమండలి జాతీయ నాయకులు గని, ఆవాజ్ నాయకులు బాషా, సైదా, తెలుగు రచయితల సంఘం నాయకులు సుబాని తదిరతులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా చెత్త డబ్బాలు



స్వచ్ఛ గుంటూరు సాధన కోసం ఏటా ప్రత్యేక నిధులు ఖర్చు చేస్తున్నారు. ఇందులో భాగంగా నగరంలోని ప్రధాన రహదారుల్లో వ్యర్థాలు వేసేందుకు చెత్త డబ్బాలు ఏర్పాటు చేశారు. కొన్ని ప్రాంతాల్లో ఉన్నవి నిరుపయోగంగా మారాయి. లక్ష్మీపురంలో ఉన్నది మరమ్మతులకు గురైంది. ఇలాంటి వాటిని అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.
- **న్యూస్‌టుడే, గుంటూరు నగరం**

మాస్టర్ అథ్లెటిక్స్ మీట్‌లో క్రీడాకారుల సత్తా


విజయ చిహ్నం చూపుతూ..

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్స్‌లో తెలంగాణ మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మాస్టర్స్ అథ్లెటిక్స్ హాఫ్ సీజన్‌మీట్ నిర్వహించినట్లు కార్యదర్శి డి.లక్ష్మి తెలిపారు. గుంటూరుకు చెందిన 16 మంది క్రీడాకారులు 100, 400, 1500 మీటర్ల పరుగు, లాంగ్ జంప్, 3 కిలోమీటర్ల వాక్ తదితర అంశాల్లో 23 పతకాలు సాధించినట్లు తెలంగాణ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మణరెడ్డి తెలిపారు. సంఘం తరపున గుంటూరు మాస్టర్ అథ్లెటిక్స్ క్రీడాకారులకు పతకాలు అందజేసి అభినందనలు తెలిపారు.

ట్రాక్టర్ బీభత్సం.. తప్పిన ప్రమాదం


నుజ్జయిన కారు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: నగరంలో ఓ ట్రాక్టర్ బీభత్సం సృష్టించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి కళామందిర్ కూడలి నుంచి బృందావన్‌గార్డెన్స్‌కు వెళ్లే మార్గంలో వేగంగా వచ్చిన ఓ ట్రాక్టర్ కారును ఢీకొంది. ఆ కారు ముందున్న మరో కారుకు తగిలింది. ఈ ఘటనలో మొదటి కారు వెనుక భాగం నుజ్జయ్యింది. కారులో ఉన్నవాళ్లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఇతర వాహనదారులకు త్రుటిలో ప్రమాదం తప్పినట్లైంది. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. ట్రాక్టర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని అతడికి శ్వాస పరీక్షలు చేయగా మద్యం మత్తులో ఉన్నట్లు తేలింది. కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను జప్తు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ సింగయ్య తెలిపారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: భార్యను వేధిస్తున్న భర్తపై అరండల్‌పేట ఠాణాలో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. బొంగరాలబీడుకు చెందిన సాత్వికకు అదే ప్రాంతానికి చెందిన రాఘవ ప్రకాష్‌తో 2022లో వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొంతకాలంగా సాత్వికను భర్త మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. ఆమె మృతి చెందినట్లుగా వాట్సప్‌లో స్టేటస్‌లు పెడుతున్నాడు. వేధింపులు తట్టుకోలేక ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

పట్నంబజారు, న్యూస్‌టుడే: బస్టాండు సెంటర్‌లో ఆదివారం డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపిన నలుగురు చోదకులపై కేసులు నమోదు చేసి, వాహనాల్ని స్వాధీనం చేసుకున్నట్లు తూర్పు విభాగపు ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు ఆయన హెచ్చరించారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: రౌడీషీటర్లు నేరాలకు దూరంగా ఉండాలని పోలీసు అధికారులు స్పష్టం చేశారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో ఆదివారం జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసుస్టేషన్‌ల్లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు, నేరప్రవృత్తి కలిగిన వ్యక్తుల కదలికలపై జిల్లా వ్యాప్తంగా నిరంతర నిఘా ఉంటుందని పోలీసు అధికారులు తెలిపారు. రౌడీయిజం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే ఉపేక్షించమన్నారు.

ఉత్సాహంగా ట్రెక్కింగ్



మారుతీనగర్, న్యూస్‌టుడే : యూత్ హాస్టల్స్ అసోసియేషన్ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో పేరేచర్లలోని నగరవనం కొండను అధిరోహించారు. గుంటూరుకు చెందిన 30 మంది ట్రెక్కర్స్ ఇందులో పాల్గొన్నారు. కార్యవర్గ సభ్యులు కె.కొండయ్య, టి.చంద్రశేఖర్, ఎన్.శ్రీలత, గుణరంజన్ తదితరులు పాల్గొన్నారు.





మన్‌కీ బాత్‌తో విద్యార్థులకు ఉపయోగం


కార్యక్రమాన్ని వీక్షిస్తూ..

పట్నంబజారు, న్యూస్‌టుడే: మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించడం ద్వారా విద్యార్థులు పలు వైజ్ఞానిక అంశాలు తెలుసుకుంటారని జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు డా.దార అంబేడ్కర్ పేర్కొన్నారు. మన్‌కీ బాత్ 137వ ఎపిసోడ్‌ను ఆదివారం అడవి తక్కెళ్లపాడులోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో భాజపా నాయకులు 400 మంది విద్యార్థులతో కలిసి చూశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ హనుమంతరావు, అధ్యాపకురాలు పద్మ, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంతేటి బ్రహ్మయ్య, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి గట్టుపల్లి అబ్రహం, జిల్లా కార్యదర్శి నులక యేసు రత్నం తదితరులు పాల్గొన్నారు.



టమాట 24, వంగ 25, బెండ 17, పచ్చి మిర్చి 38, కాకర 32, బీర 37, క్యాలిఫ్లవర్ 35, క్యాబేజి 25, క్యారెట్ 52, దొండ 28, బంగాళ దుంప 23, ఉల్లిపాయలు 48, గోరుచిక్కుళ్లు 29, దోస 16, సొర 14, పొట్ల 16, అరటికాయ 10, పెద్ద చిక్కుళ్లు 29, చామ దుంప 34, మునగ 8, బీట్‌రూట్ 42, కీర 50, బీన్స్ 95, క్యాప్సికమ్ 50, కొత్తిమీర 25, ఆకుకూరలు 10, నిమ్మకాయలు 75, అల్లం 185, వెల్లుల్లి 185 (కిలో.. రూ.లో). - **న్యూస్‌టుడే, పట్టాభిపురం**



